



epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

TELANGANA RISING
CURE - PURE - RARE

సంపుటి : 19 సంచిక : 57 | 08-05-2026 శుక్రవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00


## రెగ్యులర్‌గానే సీఎం కాన్వాయ్

### ట్రాఫిక్ ఆపకుండా నేరుగా ప్రయాణం



**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజలకు ఆటంకం కలిగించొద్దంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీని బుధవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఆయన కాన్వాయ్ సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణం చేసింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన నివాసానికి రెగ్యులర్ ట్రాఫిక్‌లోనే సీఎం వెళ్లడం విశేషం. తన కాన్వాయ్ రాకపోకల కోసం నగరవ్యాప్తంగా ప్రజల వాహనాలను నిలిపివేయొద్దంటూ నిన్న సీనియర్ పోలీసు అధికారులకు సీఎం ఆదేశించారు. రోడ్లపై ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యల్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ఈ నేపథ్యంలో సీఎం కాన్వాయ్ కదలికల సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడానికి బదులుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఒకే లేన్‌లో కదలడానికి అనుమతించారు.

## పదేళ్ల బీఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్



- 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ
- బీఆర్ఎస్ నేతల విమర్శలు చూసి రైతులు నవ్వుకుంటున్నారు
- రైతులు ఆర్గానిక్ వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి
- వరంగల్ రైతుమేళాలో పాల్గొన్న మంత్రి తుమ్మల



బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లలోనే చేశారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మొదటి ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశారని చెప్పారు. రైతులందరూ ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. రసాయనాల వాడకాన్ని తగ్గించకపోతే వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. గురువారం హనుమకొండలో జరిగిన రైతుమేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.

వార్త 2లో



## కొండా సురేఖ వ్యాఖ్యలు అభ్యంతరకరం

జై శ్రీ రామ్ అంటే పై నుంచి పైసలు పడతాయా అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ మంత్రి అంటే దేవుడికి మినిస్టర్‌లాగా ఉండాలని.. కానీ కొండా సురేఖ ఏ శాఖకు మంత్రి..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం హైదరాబాద్ లో రాజాసింగ్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు జై శ్రీరాం అన్నారని ప్రస్తావించారు. మరి ఇప్పుడు తన మంత్రికి జై శ్రీరాం గురించి నేర్పించలేదా..? అని నిలదీశారు.

2

## పొన్నంకు మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసలు



**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణ రవాణా శాఖ పనితీరును కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కేంద్రమంత్రి అభినందనలు తెలిపారు. మంత్రి పొన్న ప్రభాకర్‌ని ప్రశంసిస్తూ నితిన్ గడ్గరీ గురువారం లేఖ రాశారు. చెక్‌పోస్టుల రద్దు నిర్ణయంపై ప్రశంసలు కురిపించారు. వాహన్ సమీకరణపై కేంద్రమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లను ప్రశంసించారు. రోడ్డు భద్రత చర్యల్లో తెలంగాణ ముందంజలో ఉందని కొనియాడారు. డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణపై ప్రశంసలు కురిపించారు. ప్రజా అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

## గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

బిజెపి కార్యకర్తల గుండాల్లో దాడులు చేయడమేంటి మండిపడ్డ కెటిఆర్ , హరీష్ రావులు



వార్త 2లో

## రేవంత్‌తో బండి సంజయ్ మిలాఖత్

### కోట్ల ఆస్తులు ఎక్కడివంటూ కౌశిక్ రెడ్డి ప్రశ్న



**కరీంనగర్,**

కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. రేవంత్ ఏది మాట్లాడితే.. బండి సంజయ్ అదే మాట్లాడుతున్నారని తెలిపారు. బండి సంజయ్ తిట్టాల్సింది కేటీఆర్‌నా .. రేవంత్ రెడ్డినా అని ప్రశ్నించారు. బంగారం షాపులో దొంగతనం జరిగితే ప్రభుత్వానికి బాధ్యత లేదా అని నిలదీశారు. రేవంత్‌ను సంజయ్ ఒక్క మాట కూడా ఎందుకు అనడం లేదని అన్నారు. భార్య పుస్తెలు అమ్మి పోటీ చేసిన బండి సంజయ్‌కు కోట్ల రూపాయలు ఎక్కడివని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బండి సంజయ్‌కు రేవంత్ రెడ్డి డబ్బులు పంపిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కేంద్ర మంత్రికి లేదన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే కేటీఆర్‌తో చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్‌ను ఇష్టం వచ్చినట్టు తిడితే ఊరుకునేది లేదన్నారు. బండి సంజయ్‌ను కూడా తాము తిట్టగలమని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## మహిళా సంఘాలకు సీతక్క శుభవార్త

- వడ్డీలేని రుణాలు 5 నుంచి పది లక్షలకు పెంపు
- ఈ మొత్తలకు ప్రభుత్వమే వడ్డీల చెల్లింపు
- పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి




2 లో..

మహిళా స్వయం సహాయక బృందాలకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు.



## డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు.

2



## హైదరాబాద్‌లో రూ.85 వేల కోట్ల విలువైన భూములు కాపాడాం: హైడ్రా కమిషనర్

2

# కొండా సురేఖ వ్యాఖ్యలు అభ్యంతరకరం

**ఎండోమెంట్ మంత్రిగా ఇలానేనా వ్యాఖ్యానించేది**

**మండిపడ్డ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్**

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జై శ్రీ రామ్ అంటే పై నుంచి పైసలు పడతాయా అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ మంత్రి అంటే దేవుడికి మినిస్టర్‌లాగా ఉండాలని.. కానీ కొండా సురేఖ ఏ శాఖకు మంత్రి..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం హైదరాబాద్ లో రాజాసింగ్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు జై శ్రీరాం అన్నారని ప్రస్తావించారు. మరి ఇప్పుడు తన మంత్రికి జై శ్రీరాం గురించి నేర్పించలేదా..? అని నిలదీశారు. జై శ్రీరాం అంటే కొండంత బలం వస్తోందని...కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి పోతుందని ఆమెకు చెప్పాలని అన్నారు. తెలంగాణలో దేవుడి భూముల అమ్మకాలు, కబ్జాలు ఎలా జరుగుతున్నాయో చూస్తున్నామని అన్నారు. ఈ విషయంలో కొండా సురేఖ ఎలాంటి చర్యలు చేపట్టారు...? అని రాజాసింగ్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో దేవుడి భూములను ఎంఐఎం నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు వారితో కుమ్మక్కై కమీషన్లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి దేవాలయాల అభివృద్ధి మీద ధ్యాస లేదని ఆగ్రహించారు. ఎంఐఎం నేతలిచ్చే కమీషన్ల మీదనే ఈ మంత్రికి ధ్యాస ఉందని ఎద్దేవా చేశారు. రాముడి నామాన్ని ఎదిరించడానికి సాహసించేవారు.. ఎవరైనా గాల్లో కొట్టుకుపోతారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, దయచేసి మీ దేవాదాయ శాఖ మంత్రిని పిలిపించి రాజీనామా చేయించాలని హితవు పలికారు. లేకపోతే మీరు కూడా కేసీఆర్ లాగా మునిగిపోతారని రాజాసింగ్ విమర్శించారు.

# డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

**రిపీటెడ్‌గా పట్టుబడితు పిడి యాక్ట్ పెట్టే ఆలోచన**

**ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు**

**సమీక్షలో డిజిపి సివి ఆనంద్**

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. నార్కోటిక్స్‌పై అలర్ట్‌గా ఉన్నామని.. డ్రగ్స్ కట్టడి చేయడంలో మొదటి ప్రాధాన్యతతో ఉన్నామన్నారు. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించామని వివరించారు. ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్‌లు నిర్వహించడం ద్వారా నిందితులను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో సరఫరాతోపాటు డిమాండ్.. ఈ రెండింటిపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈగల్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. సివిల్ ఫోర్స్ అవసరం కూడా ఉందని చెప్పారు. డ్రగ్స్ సప్లయర్స్ ఆస్తులను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు కూడా డ్రగ్స్ కట్టడిలో కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో నిఘా లోపించిందని ఈ సమీక్షా ద్వారా బహిర్గతమైందని చెప్పారు. నార్కోటిక్ ఐదు పోలీస్ స్టేషన్‌లు మంచిగా పని చేసి, ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి యూనివర్సిటీలతోపాటు విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ బాధ్యత యజమాన్యాలదేనని డీజీపీ సీవీ ఆనంద్ కుండబద్దలు కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాల్లో అధికారులు డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందన్నారు. జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అధికారులకు ఈగల్ ఫోర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

# గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

**బిజెపి కార్యకర్తుల గుండాల్లో దాడులు చేయడమేంటి**

**మండిపడ్డ కెటిఆర్ ,హరీష్ రావులు**

హైదరాబాద్,

: కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దాడులను తీవ్రంగా ఖండించారు. పట్టపగలు గూండాల్లా వచ్చి వాహనాలు, ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొల్పుతున్నారంటూ బండి సంజయ్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. 'ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి జరిగిన వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో మాట్లాడాం. పట్టపగలు గుండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలను, ఆఫీసును ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. కళ్లముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌కు బీ-టీంగా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొలుపుతున్నారు. ప్రతిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు కుప్పిగంతులు వేయడం తప్ప కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ చేసిందేమీ లేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతోనే శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బండి సంజయ్ అనుచరుల దాడిని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ పట్టణంలో బీజేపీ గుండాలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేసి కిటికీల అద్దాలు పగులగొట్టారని తెలిసిందే. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్



ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి నాయకులు, కార్యకర్తల యోగక్షేమాల అడిగి తెలుసుకున్నారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పదేళ్ల బీఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

**25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ**

**బీఆర్ఎస్ నేతల విమర్శలు చూసి రైతులు నవ్వుకుంటున్నారు**

**రైతులు ఆర్గానిక్ వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి**

**వరంగల్ రైతుమేళాలలో పాల్గొన్న మంత్రి తుమ్మల**

హనుమకొండ, అక్షరకలం ప్రతినిధి

బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లలోనే చేశారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మొదటి ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశారని చెప్పారు. రైతులందరూ ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. రసాయనాల వాడకాన్ని తగ్గించకపోతే వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు.



గురువారం హనుమకొండలో జరిగిన రైతుమేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రైతు మేళాలో తుమ్మల పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలు వరంగల్ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై చౌకబారు వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై కేటీఆర్ అండ్ కో అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఎగ్గొడితే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారని ప్రస్తావించారు. యుద్ధం వల్ల యూరియా ఆగిపోయినా మన రైతులకు యూరియా అందించామని మంత్రి తుమ్మల తెలిపారు. యూరియాపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా రూ.లక్షకోట్లను రైతుల కోసం ఖర్చుపెట్టామని తెలిపారు. కేసీఆర్ హయాంలోని అవినీతి, అహంకారాన్ని రైతులు ఎప్పటికీ మరచిపోరని చెప్పుకొచ్చారు. కాకతీయుల గడ్డపై కేటీఆర్, తదితరులు చేసిన ప్రసంగాన్ని ప్రజలంతా అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. మొక్కజొన్నలు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ధాన్యం, మొక్కజొన్నలు వీలైనంత త్వరగా కొనుగోలు చేయాలని వేదికపైనే కలెక్టర్లను ఆదేశిస్తున్నానని అన్నారు. దేశంలో రైతులకు యూరియా అందించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తుమ్మల తెలిపారు. రైతులకు సంబంధించిన అంశంలో వెనకడుగు వేయబోమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కొంతమంది తనను అవమానపరచాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అన్నదాతలు పంట మార్పిడి చేయాలని, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశర చేశారు. రైతుల ఖాతాల్లో కాంగ్రెస్ సర్కార్ రూ.21 వేల కోట్లను జమ చేసింది. రూ.లక్ష రుణమాఫీని కేసీఆర్ పదేళ్లలో ఏనాడూ పూర్తి చేయలేదు. రుణమాఫీకి బీఆర్ఎస్ ఐదేళ్ల సమయం తీసుకోవడంతో.. వాళ్లిచ్చింది వడ్డీలకు కూడా సరిపోలేదు. ఒక్క రైతుబంధు ఇచ్చి.. మిగతా పథకాలన్నింటినీ నిలిపివేశారు. బీఆర్ఎస్ అహంకార వైఖరిని ప్రజలు ఇంకా మర్చిపోలేదు. మళ్లీ ఆ పార్టీకి అధికారం ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరు. ఇవాళ రైతులకు అప్పులు తక్కువున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుందని తుమ్మల తెలిపారు.

# మహిళా సంఘాలకు సీతక్క శుభవార్త

**వడ్డీలేని రుణాలు 5 నుంచి పది లక్షలకు పెంపు**

**ఈ మొత్తలకు ప్రభుత్వమే వడ్డీల చెల్లింపు**

**పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి**

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

మహిళా స్వయం సహాయక బృందాలకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల రుణాలకు ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. అప్పటి వరకు అర్హత గల మహిళా సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పించామన్నారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నామని వివరించారు. మహిళలపై భారాన్ని దించేందుకు వడ్డీ లేకుండా రెట్టింపు లోన్లు ఇస్తున్నామన్నారు. బ్యాంకులకు రీ పేమెంట్ బాగా చేస్తున్నారంటూ మహిళా సంఘాలపై ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు.మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం యజ్ఞంలా తామంతా పని చేస్తున్నామని వివరించారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే వడ్డీ లేని రుణాలు ఇప్పించి ఆర్థికంగా మహిళలను ఎదిగేలా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో తాము పనిచేస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. 40 శాతం పంట



కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించామని గుర్తు చేశారు. ఏడాది రూ. 26 వేల కోట్లకు పైగా మహిళలకు బ్యాంకు రుణాలుగా అందిస్తున్నట్లు మంత్రి సీతక్క వివరించారు. మహిళల ఆర్థిక సాధికారతలో ఇది ఒక మైలురాయి అని అభివర్ణించారు. ఇది లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో మహిళలకు పట్టుమని రూ. పది వేల లోన్ ద్వారా లభించేవి కాదన్నారు. ఇప్పుడు అదే మహిళలకి బ్యాంకులు లక్షలాది రూపాయలు లోన్ రూపంలో అందిస్తున్నాయని వివరించారు. పేదరికం వల్లే తాను నక్సలైట్లలో చేరానని ఈ సందర్భంగా సీతక్క గుర్తు చేసుకున్నారు. వడ్డీ వ్యాపారుల దోపిడి కారణంగా సామాన్యులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి బాధ చూడ లేక తాను తుపాకీ పట్టానని వివరించారు. ఆ అనుభవంతోనే మహిళలకు వడ్డీ లేని రుణాలు కల్పించాలనే సంకల్పంతో తాము పని చేస్తున్నామని మహిళా స్వయం సహాయక బృందాలకు మంత్రి సీతక్క తెలిపారు. నిర్మల్ జిల్లా జీరో ఎన్‌పీఏ సాధించిందని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ విజయలక్ష్మిని మంత్రి సీతక్క అభినందించారు. నిర్మల్ జిల్లా తరహాలోనే అన్ని జిల్లాలు వంద శాతం బ్యాంకులకు రీపేమెంట్ చేయాలని సూచించారు. బ్యాంకర్ల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టాలని మహిళా సంఘాలకు మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు సరళమైన పద్ధతిలో లోన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా బ్యాంకర్లకు మంత్రి సూచించారు. బ్యాంకులకు తాము గ్యారెంటీ ఇస్తున్నామని చెప్పారు. పూర్తిస్థాయిలో రీపేమెంట్ చేసే బాధ్యత తమదన్నారు. వ్యక్తులకు లోన్ ఇస్తే ఎగ్గొట్టే ప్రమాదం ఉంటుందని.. అదే మహిళా శక్తికి సహకరిస్తే మీ నగదుకు భద్రత లభిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.




# కరీంనగర్‌లో దాడులతో ఉద్రిక్తత

**గంగుల కమలాకర్ కార్యాలయంపై దాడి**

**కౌశిక్ రెడ్డి కారు అద్దాలు ధ్వంసం**

**లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టిన పోలీసులు**

కరీంనగర్ అక్షరకలం ప్రతినిధి

కరీంనగర్ పట్టణంలో ఉ ద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. బీజేపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేశారు. కిటికీల అద్దాలు పగులగొట్టారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు. దీంతో హుజురాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కార్యాలయంలోకి బీజేపీ శ్రేణులు చొచ్చుకెళ్లారు. ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. బీజేపీ కార్యకర్తలపై బీఆర్ఎస్ శ్రేణులు కర్రలతో దాడి చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేశారు. బీజేపీ శ్రేణులను అరెస్ట్ చేసి.. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను క్యాంప్ కార్యాలయానికి తరలించి, గేట్లు మూసేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కౌశిక్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ శ్రేణులు ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ఉదయం కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు పాడి కౌశిక్‌రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. బీజేపీ శ్రేణులను చెదరగొట్టారు. భారీ బందోబస్తు నడుమ కౌశిక్ రెడ్డిని కరీంనగర్ నుంచి హుజురాబాద్‌కు తరలించారు. హుజురాబాద్ క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలతో ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో బీజేపీ శ్రేణులు ఒక్కసారిగా లోపలికి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. కౌశిక్ రెడ్డి క్యాంప్ కార్యాలయంపై దాడికి యత్నించారు. దీంతో వారిని బీఆర్ఎస్ కార్యకర్తలు, కౌశిక్ రెడ్డి అనుచరులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు ఉండగానే బీజేపీ శ్రేణులు చొచ్చుకురావడంతో కౌశిక్ రెడ్డి అనుచరులు వారిపై కర్రలతో దాడి చేశారు. దీంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# హైదరాబాద్‌లో రూ.85 వేల కోట్ల విలువైన భూములు కాపాడాం: హైడ్రా కమిషనర్

**హైడ్రా పరిధిలో రూ.10 లక్షల కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురయ్యాయన్న రంగనాథ్**

**హైడ్రాను తెలంగాణవ్యాప్తంగా విస్తరిస్తామన్న రంగనాథ్**

**సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణిని నాలుగు వారాలపాటు నిలిపివేశామని వెల్లడి**

అక్షరకలం ప్రతినిధి

హైదరాబాద్ నగరంలో కబ్జాల నుంచి సుమారు రూ.85 వేల కోట్ల విలువైన భూములను కాపాడామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ప్రస్తుతం హైడ్రా పరిధిలో రూ.10 లక్షల కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురైనట్లు తమకు సమాచారం ఉందని ఆయన తెలిపారు. ఆయన ఈరోజు మిర్యాలగూడలో పర్యటించి, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హైడ్రాను తెలంగాణవ్యాప్తంగా విస్తరిస్తామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. హైదరాబాద్‌లో హైడ్రా కార్యకలాపాలకు ప్రజలంతా ఆకర్షితులయ్యారని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా కావాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. కబ్జాలపై హైడ్రాకు వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన తెలిపారు. ఆయా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తాము చర్యలు చేపడుతున్నామని అన్నారు. అందుకే నాలుగు వారాల పాటు ప్రజావాణిని నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పుడున్న దరఖాస్తుల పరిష్కారం కోసమే ప్రజావాణిని రద్దు చేశామని స్పష్టం చేశారు. హైడ్రాకు వ్యతిరేకంగా కొంతమంది కోర్టులను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు.

# మద్యం మత్తులో పోలీసులపై కత్తితో దాడి..

### ముద్దాయిని అరెస్టు చేసిన పోలీసులు, జ్యుడీషియల్ రిమాండ్ కు తరలింపు.

**అక్షర కలం/ పినపాక.**



శుక్రవారం సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో సమ్మక్క సారక్క టెంపుల్ వద్ద మణుగూరు పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా తోగ్గూడెం నుండి మద్యం తాగి బండి నడుపుకుంటూ వస్తున్న సోలెం నాగేశ్వరరావు అనే వ్యక్తిని ఆపి డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చెయ్యగా అతనికి 80 బీ ఏ సి పర్సంటేజ్ రాగ అతనిని తిరిగి ఇంటికి పంపించినట్లు తెలిపారు. అయితే అతను ఇంటికి వెళ్లినట్లే వెళ్లి తిరిగి కత్తి తీసుకొని వచ్చి, నాకే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తారా అంటూ వాహనాలు తనిఖీ చేస్తున్న మణుగూరు పోలీస్ వారి విధులకు ఆటంకం కలిగిస్తూ కత్తి తో దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. సోలెం నాగేశ్వవరరావు తండ్రి పేరు సత్యం తో గూడెం ప్రాంతానికి చెందినవడుగా తెలిసింది. ఈ నే పద్యం లో నాగేశ్వరరావుని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాంండ్ కు తరలించినట్లు తెలిపారు...

# జన గణన అవగాహన కార్యక్రమం 2027



**అక్షర కలం జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి**

జన గణన అనేది దేశ అభివృద్ధికి ఎంతో ముఖ్యమైన ప్రక్రియ. ప్రజల సంఖ్య విద్య ఉపాధి నివాస పరిస్థితి వంటి వివరాలను సేకరించడం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు సమర్థవంతంగా అమలు చేయగలరు. ఈ లక్ష్యంతో 2027 జనగణన అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు జనగణన యొక్క ప్రాముఖ్యతను వివరించేందుకు ఈ యొక్క ర్యాలీ ముఖ్య ఉద్దేశం. ప్రతి కుటుంబం సరైన సమాచారాన్ని అందించడం వల్ల ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతాయని తెలియజేశారు. జనగణ సమయంలో ప్రజలు సహకరించాల్సిన విధానాన్ని ఇంటింటికి వచ్చే సిబ్బందికి సరైన సమాచారం ఇవ్వాలని అలాగే జనగణన ద్వారా దేశాభివృద్ధికి ప్రతిపరుడు భాగస్వామి కావాలని చెప్పారు. గద్వాల పట్టణంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రెవిన్యూ డిప్యూటీ తాసిల్దార్ అజిత్ కుమార్, అలాగే పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు, విద్యాశాఖ ఉద్యోగులు రేషన్ డీలర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

## విధులకు ఏళ్లుగా గౌర్హాజరు

## 51 మందిపై వేటు వేసిన ప్రభుత్వం

## క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదన్న మంత్రి సత్యకుమార్

**అమరావతి,**



ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యుల పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 51 మంది వైద్యులను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించారు. శాశ్వత ఉద్వాసనకు గురైన 51 మందిలో బోధనాసుపత్రులకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు 8 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 41 మంది, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో ముగ్గురు ప్రొఫెసర్లపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలగించిన వారిలో కొందరు ఏడేళ్ల నుంచి, మరికొందరు ఆరేళ్ల నుంచి విధులకు దూరంగా ఉంటూ సొంత వ్యాపకాలు సాగిస్తున్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్–1964 ప్రకారం ఏడాదికి మించి విధులకు గైర్హాజరైతే రాజీనామా చేసినట్లుగానే పరిగణించే అధికారం ప్రభుత్వానికి ఉంది. నిబంధనల మేరకు వీరికి ముందస్తుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వడానికి తగిన సమయం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఏడాదిలోపు గైర్హాజరీలో ఉన్న మరో 33 మంది వైద్యులు ఇందులో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఛార్జిమెమోలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా విధుల్లో చేరని పక్షంలో వీరిని కూడా విధుల నుంచి తొలగించనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వ హెచ్చరికలతో ఇప్పటికే 11 మంది వైద్యులు తిరిగి విధుల్లో చేరారు. వైద్యుల బాధ్యతారాహిత్యాన్ని ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. . త్వరలోనే మరో ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా ఇటువంటి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విధులకు గైర్హాజరైన వారిలో కాకుండా, మరో 33 మంది వైద్యులకు ప్రభుత్వం ఛార్జిమెమోలు జారీ చేసింది. వైద్య సేవలకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# నెల్లూరులో మహానాడుకు భారీగా ఏర్పాట్లు

### మహానాధు సభాస్థలి వద్ద మంత్రుల భూమిపూజ

**నెల్లూరు,**

ఈ నెల 27వ తేదీ నుంచి 29 వరకు తెలుగుదేశం మహానాడు నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేయనున్నారు.కోవూరు నియోజకవర్గం ఇఫ్కో కిసాన్ సెజ్‌లో మహానాడు ఏర్పాట్లకు వైభవంగా భూమి పూజ జరిగింది. ఏపీతో పాటు పలు రాష్ట్రాల నుంచి ప్రముఖులు, నేతలు, శ్రేణులు తరలి రానున్నారు. భూమి పూజలో ఎంపీ వేమిరెడ్డి, మంత్రులు ఆనం రామనారాయణ, నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు రాష్ట్ర నేతలందరూ జిల్లాలోనే ఉంటారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. భవిష్యత్తుతరాలకు ఉపయోగపడేలా తీర్మానాలు ఉంటాయన్నారు. మొదటి రెండు రోజులు 20 వేల మంది డెలిగేట్స్ వస్తారని.. మూడో రోజు బహిరంగ సభ ఉంటుందని వెల్లడించారు. బహిరంగసభకు 7 లక్షలకు పైగా కార్యకర్తలు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. నెల్లూరులో మొదటిసారి మహానాడు నిర్వహిస్తున్నామని మంత్రి నారాయణ అన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో 2200 ఎకరాల స్థలం ఉందని.. పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు ఉండవని అన్నారు. పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహం కనిపిస్తోందన్నారు. మూడు రోజుల పాటు జరిగే మహానాడులో ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. అందర్నీ సమన్వయం చేస్తూ, సమష్టి కృషితో మహానాడును విజయవంతం చేస్తామని మంత్రి వెల్లడించారు.'మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గత ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తామే గెలుస్తామంటూ ప్రగల్భాలు పలికారు. ఒక్క స్థానంలోనూ వైసీపీని గెలిపించలేక పోయారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఈసారైనా కనీసం ఒక స్థానాన్ని గెలిపించే దమ్ము నీకుందా?.. దమ్ముంటే గెలిపించి చూపించు' అంటూ కాకాణికి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సవాల్ విసిరారు.

# బందరు చరిత్ర తిరగరాసేలా అభివృద్ధి

### పట్టణంలో అన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరా

### మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ

**మచిలీపట్నం**

బందరు చరిత్ర తిరగరాసేలా అభివృద్ధి చేసి చూపిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్లు మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. బుధవారం బందరులో తాగునీటి పైపులైన్లు, డీడబ్ల్యూఎమ్ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బందరులోని ప్రతి ప్రాంతానికి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు అందించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆరోపణలు, విమర్శలు తప్ప మాజీ మంత్రి పేర్నినానికి బందరు అభివృద్ధి పట్టదని విమర్శించారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే తొక్కి పడేస్తామని కొల్లు రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. గతంలో రోడ్లను కూడా పట్టించుకోలేదని వైసీపీపై మంత్రి విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక



గుంతలు లేని మచిలీపట్నాన్ని సాకారం చేశామన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.28 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించామని తెలిపారు. గతంలో ఎంపీగా పని చేసిన కొనకళ్ల నారాయణ రావు, ప్రస్తుత ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషితో కేంద్రం నుంచి నిధులు వచ్చాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు సమకూర్చి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రాంతంలో ఇనుము దొంగిలించేశారంటూ పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు చూపించమంటే తేలుకుట్టిన దొంగల్లా పారిపోతున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డులో పెట్టిన ఇనుము పాడైపోతుంటే.. దాన్ని వేరే ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం కోసం వినియోగించడం లో తప్పేముందని ప్రశ్నించారు. తప్పు జరిగితే ఫిర్యాదు చేయాలని.. కానీ అధికారులను బెదిరించడం దుర్మార్గమని మండిపడ్డారు. 2014–19 మధ్య పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను గత ఐదేళ్లు లబ్ధిదారులకు అందకుండా పాడుబెట్టారని మంత్రి ఆరోపించారు. కరగ్రహారం లే అవుట్ పేరుతో వైసీపీ నాయకులు పేదల భూములను తక్కువ ధరకు కొని ప్రభుత్వానికి అధిక ధరకు అమ్మి లాభాలు పొందారని వ్యాఖ్యానించారు. ఇళ్లు కట్టుకోవడానికి కూడా పనికిరాని ప్రాంతాల్లో భూ కేటాయింపుల పేరుతో దోచుకున్నారన్ని ÷ర్ అయ్యారు. ఆ లే అవుట్లలో రోడ్లు, తాగునీటి సౌకర్యాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని పేర్ని నాని, జగన్ రెడ్డిని ప్రశ్నించారు. పేర్నినాని రోజూ మీడియా ముందుకు వచ్చి చెత్త ఆరోపణలు చేయడం తప్ప అభివృద్ధి కోసం ఒక్క ఆలోచన కూడా చేయలేదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

# విశాఖ రైల్వే జోన్ గెజిట్ విడుదల

### రాయగడ కేంద్రంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఏర్పాటు

### రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ

**విశాఖపట్టణం,**

విశాఖపట్టణం కేంద్రంగా కొత్త రైల్వేజోన్ గెజిట్‌ను కేంద్ర రైల్వే బోర్డు అధికారికంగా విడుదల చేసింది. జూన్ 1, 2026 నుంచి దక్షిణ కోస్తా రైల్వేను అధికారికంగా ప్రారంభించనుంది. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో రాయగడ కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటైంది. వాల్తేరు డివిజన్‌ను విభజించి విశాఖపట్టణం, రాయగడ డివిజన్లుగా మార్పు చేసింది. దక్షిణ కోస్తా, ఈస్ట్ కోస్ట్, దక్షిణ మధ్య రైల్వేల పరిధిలో కీలక మార్పులు చేసింది. పాత వాల్తేరు డివిజన్‌లోని విశాఖ నగరం సహా పరిసర ప్రాంతాలు ఇకపై విశాఖపట్టణం డివిజన్‌గా మార్చింది. రాయగడ కేంద్రంగా ఏర్పాటయ్యే కొత్త డివిజన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే కింద పనిచేస్తుందని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. దక్షిణ కోస్తా రైల్వే పరిధి కొత్త జోన్ పరిధిలోకి గుంతకల్, గుంటూరు, విజయవాడ, విశాఖపట్టణం డివిజన్లను ఏర్పాటుచేసింది. ఇకపై సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు మాత్రమే దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉంటాయని తెలిపింది. ఖుర్దా రోడ్ డివిజన్‌లో గల 'ఇచ్ఛాపురం నుంచి పలాస' వరకు గల మార్గాన్ని విశాఖపట్టణం డివిజన్‌కు బదిలీ చేసింది. గుంతకల్ డివిజన్ నుంచి 'రాయచూర్ – వాడి సెక్షన్' సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అయింది. పగిడిపల్లి – విష్ణుపురం మార్గాన్ని.. గుంటూరు డివిజన్ నుంచి సికింద్రాబాద్ డివిజన్‌కు మార్పు చేసింది. కొండపల్లి – మోటుమర్రి మార్గాన్ని సికింద్రాబాద్ డివిజన్ నుంచి విజయవాడ డివిజన్‌కు బదిలీ చేసింది. రాయగడ, విశాఖపట్టణం డివిజన్ల మధ్య సింగపూర్ రోడ్ – విజయనగరం కొత్త సరిహద్దు ఖరారు చేసింది. సౌత్ పోస్ట్, ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ల మధ్య స్పష్టమైన సరిహద్దు కిలోమీటర్లను గెజిట్‌లో రైల్వే బోర్డు వెల్లడించింది. ఈ మార్పులన్నీ జూన్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో రైల్వే బోర్డు స్పష్టం చేసింది.

# సినిమా పేరుతో 25 లక్షల మోసం

### సంగీత దర్శకుడు పలాశ్ మచ్చల్‌పై కేసు

**ముంబయి,**

ప్రేమపేరుతో టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన ను మోసం చేసిన ప్రముఖ సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్ పై మహారాష్ట్రలోని సాంగ్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. స్మృతి మంధాన స్నేహితుడు విజ్ఞాన్ ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ పరిణామం చోటుచేసుకుంది. విజ్ఞాన్ ప్రకాశ్ తన ఫిర్యాదులో పలాశ్ ముచ్చల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక సినిమా ప్రాజెక్టు కోసం పలాశ్ తన వద్ద నుంచి రూ. 25 లక్షలు తీసుకున్నారని, అయితే ఆ తర్వాత తనను మోసం చేశారని విజ్ఞాన్ పేర్కొన్నారు. గత ఏడాది నవంబరు 22న ఈ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని, ఆ సమయంలో పలాశ్ తన కులాన్ని ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదులో వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సాంగ్లీ పోలీసులు పలాశ్ ముచ్చల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. దీనిపై పలాశ్ ముచ్చల్ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. పలాశ్ ముచ్చల్ వ్యక్తిగత జీవితం కూడా గత కొంతకాలంగా వార్తల్లో నిలుస్తోంది. ఆయన, క్రికెటర్ స్మృతి మంధాన మధ్య నిశ్చితార్థం జరిగి, పెళ్లి కూడా ఎ÷–లాన్ అయినప్పటికీ అనూహ్యంగా అది రద్దయినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అప్పట్లో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. వాటిపై స్పందించిన పలాశ్, ఆధారాలు లేని వార్తలను నమ్మవద్దని, తన వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొన్నారు. అయితే తాజాగా నమోదైన అట్రాసిటీ కేసుతో పలాశ్ ముచ్చల్ చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కేసు విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

# శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమ

### శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

**తిరుపతి,**

శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్యారియర్ ఏసీ తయారీ కేంద్రం భారతదేశంలోని తమ ఉత్పత్తుల్లో 80 శాతం శ్రీసిటీలో నుంచి సరఫరా చేయబోతోందని తెలిపారు. కుటుంబంలో తల్లి ప్రేమ ముందు.. ఓ తండ్రి చేసే త్యాగాలు పిల్లల కంటికి తెలియదన్నారు. అలాగే ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి చేసిన కృషిని కొందరు సరిగ్గా అర్థం చేసుకోరని.. అయినా కూడా ఆయన అనుకున్నది సాధిస్తారని చెప్పుకొచ్చారు. పారిశ్రామికవేత్తలకు ఏ రకమైన సేవలైనా ఒక్క వాట్సాప్ మేసేజ్‌తో చేయటానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. శ్రీసిటీలో 70 వేల మంది ఉద్యోగుల్లో 35 వేల మంది మహిళలు ఉన్నారని.. శ్రీశక్తికి ఇది నిదర్శనమన్నారు. శ్రీసిటీలోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈ నెలాఖరులోపు ఏఐ ద్వారా నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టబోతున్నామని లోకేశ్ వెల్లడించారు. శ్రీసిటీలో క్యారియర్ గ్లోబల్ సంస్థ వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టనుంది. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల మందికి ఉపాధి లభించనుంది. శ్రీసిటీ పరిధిలోని ఆరూరు వద్ద ఈ పరిశ్రమకు 40 ఎకరాల స్థలం కేటాయించారు. ఒకటి, రెండు టన్నుల సామర్థ్యం కలిగిన ఏసీలే కాకుండా భారీ పారిశ్రామిక సముదాయాలకు వినియోగించే 1000 టన్నుల నుంచి 5000 టన్నుల సామర్థ్యం కలిగిన కూలింగ్ సిస్టమ్స్‌ను క్యారియర్ సంస్థ తయారుచేయనుంది. ఉదయం సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పారిశ్రామికవాడకు చేరుకున్న మంత్రి లోకేశ్‌కు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ప్రతిఒక్కరినీ మంత్రి ఆత్మీయంగా పలకరించి ఫొటోలు దిగారు. శ్రీసిటీలో శంకుస్థాపన అనంతరం మంత్రి లోకేశ్ తిరిగి ఉండవల్లికి వెళ్లనున్నారు.

# నేర సామ్రాజ్యానికి అధినేత జగన్

### ప్లానెట్ కిల్లర్స్ ఫారెస్ట్ డెస్ట్రాయిర్‌లో వైసిపి నేరచరిత్ర

### టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ

**అమరావతి,**

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. కిల్లర్, క్రిమినల్, మాఫియా పార్టీలకు అధ్యక్షుడని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విమర్శించారు. గొడ్డలి పార్టీ నేరాలు ప్రపంచ స్థాయికి ఎక్కాయన్నారు. వైఎస్ జగన్ అనుచరుడు.. ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి అరాచకాలు అన్నీ వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ఇన్వెస్టిగేటివ్ ఛానల్ జావా డిస్కవర్ విడుదల చేసిన ప్లానెట్ కిల్లర్స్ ఫారెస్ట్ డిస్ట్రాయర్ డాక్యుమెంటరీలో వైసీపీ నేర చరిత్ర అంతా బయట పడిందని విమర్శించారు. బుధవారం రాజధాని అమరావతిలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విలేకర్లతో మాట్లాడుతూ..2003లో సీఎం నారా చంద్రబాబుపై అలిపిరి క్లేమోర్ మైన్ దాడిలో ఈ కొల్లం గంగిరెడ్డి నిందితుడిగా ఉన్నాడని గుర్తు చేశారు.

# అర్థరాత్రి వర్షానికి కల్లాల్లో తడిసిన ధాన్యం

**జయశంకర్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వడ్లు, మొక్కజొన్నలు నీటిపాలయ్యాయి. ప్రభుత్వం వడ్లు , మక్కలు కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో రైతులు కల్లాల్లో రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో అకాల వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. జిల్లాలో సుమారుగా 20.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా మల్హార్, మహాదేవపూర్, పలిమెల మండలాల్లో వర్షపాతం నమోదయింది. ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ప్రభుత్వ సలహాదారుగా మాజీ డిజిపి నియామకం

**హైదరాబాద్,**

తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ బి. శివధర్ రెడ్డి నియామకం సవాల్ చేస్తూ హైకోర్టులో టి. ధన్‌పాల్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఆయన నియామకంపై ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 559పై స్టే విధించాలని హైకోర్టుకు ఆయన విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక డీజీపీ నియామకంపై గతంలో దాఖలు చేసిన పిటిషన్‌కు అనుబంధంగా కొత్త అప్లికేషన్‌ను పిటిషనర్ కోర్టులో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజీపీ నియామకం జరిగిందని తన పిటిషన్‌లో ధన్‌పాల్ రావు స్పష్టం చేశారు. యూపీఎస్సీ నుంచి అర్హుల జాబితా తీసుకోలేదని పిటిషన్‌లో ఆయన ఆరోపించారు. ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే.. డీజీపీగా నియామకం జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చీఫ్ సెక్రటరీ ర్యాంకులో ఆయనను నియమించడంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# మమతా బెనర్జీ అహంకారం !

**ప్రజాస్వామ్యంలో నిరంకుశంగా ఉంటామంటే కుదరదు. ప్రజలు ఎన్నుకుంటే నేతలు..లేదంటే అంతే సంగతులు. భారత ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజ్యాంగ బద్ధంగా ఉండాల్సిందే. కాదూకూడదంటే... కుదరదు. ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి..ఫలితాలు కూడా వచ్చేశాయి, బెంగాల్లో బిజెపి అధికారం చేపట్టబోతోంది. తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీ అధికారం దక్కించు కుంది. ఇంతవరకు ఇవే పెద్ద మార్పులు. కేరళలో ఎల్‌డిఎఫ్ స్థానంలో యూడిఎఫ్ అధికారం కైవసం చేసుకుంది. అసోం, పాండిచ్చేరిల్లో పాత ప్రభుత్వాలే కొత్తగా కొలువుదీర బోతున్నాయి. ఈ క్రమంలో బెంగాల్లో గత పదేహేనేళ్ల మమతా బెనర్జీ పాలనలో అనేక అరాచకాలను చూశాం. తానూ బంగ్లాదేశ్‌లో లాగా ఓ దేశానికి రాణిని అని భ్రమిశారు. అడ్డూ అదుపులేకుండా ఆరాచకాలకు తెలేపారు. చొరబాటుదార్లకు గేట్లు తెరిచారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇచ్చి వారిని పర్మినెంట్‌గా ఓటర్లను చేశారు. కానీ సర్ ప్రక్రియతో ఆమె ఆటలు సాగలేదు. అలాగే ఆమె తీరుతో ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓట్ల రూపంలో తమ తీర్పును తెలిపారు. 95 శాతం మంది, అందులో మహిళల క్యూలు కట్టి మమతను ఓడించారు.**

ప్రజల తీర్పును గౌరవించాల్సిన మమతా బెనర్జీ తాను ఓడిపోలేదని, రాజీనామా చేయలనని, బిజెపి వందసీట్లు చోరీ చేసిందని దగుల్బాజీ మాటలు మాట్లాడారు. అసోం, బెంగాల్లో ఓట్ చోరీ జరిగిందని రాహుల్ కూడ వంతపాడారు. మరి తమిళనాడు, కేరళలో ఓట్ చోరీ ఎదుకు జరగలేదో రాహుల్ చెప్పాలి. రాహుల్ ఓట్ చోరీ పేరుతో ఇంకా నాటకాలు ఆడితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. విపక్షనేత కూడా మతిభ్రమించి మాట్లాడడం అలవాటు చేసుకున్నారు. మమత బెనర్జీ తాను ఇండియాలో ఉన్న వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశానని అనుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లాగా తనది కూడా స్వతంత్ర రాజ్యం అనుకుంటున్నారు. అందుకే రాజ్యాంగం విలువ తెలియకుండా మాట్లాడుతున్నారు .ఆ రాజ్యాంగమే ఆమెను 15 ఏళ్లపాటు సిఎంగా మోసిందని గుర్తించడం లేదు. ఓటమితో మమతలో అసహనం పెరిగింది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. రాహుల్ ఓట్‌చోరీని సీట్ల చోరీతో పోల్చి మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని మమతా బెనర్జీ అంటున్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారం నాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. రాజీనామా చేయకుంటే బర్తరఫ్ చేస్తారని అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ గట్టిగానే హెచ్చరించారు. 15 ఏళ్లపాటు ఇవిఎంలతోనే మమత గెలిచారు. ఇప్పుడేమో ..ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీచేశారని ఆరోపించడం చూస్తే మతి భ్రమించిందనే అనుకోవాలి. ఉద్దేశ్య పూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని కూడా చెప్పుకొచ్చారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్‌ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించా రనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. నిజానికి గతంలో మమతా బెనర్జీ పకడ్బందీగా ఇవన్నీ చేశారు. మమతను సుప్రీం కూడా చీవాట్లు పెట్టింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఆమెను 15 ఏళ్లు భరించడమే ఎక్కువ. ఇలాంటి నేతలు ఉన్నందుకు సిగ్గుపడాలి. ఉమ్మడిగా పోరాటం కోసం తాను 'ఇండి' కూటమిలోనే తాను



కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు. అందుకేనేమో రాహుల్ కూడా ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. కేరళ, తమిళనాడు తప్ప అంతా ఓట్ చోరీ జరగిందని పాత ఆవుకథను మళ్లీ పదేపదే చెప్పారు. నిజానికి పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు. దేశంలో ఎక్కడా ఉనికిని పెంచుకోలేక పోయిన కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు కొత్త ఊరటనిచ్చేదిగా ఉంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఓడిపోవడం అన్నది క ఊడా ప్రజలు కోరుకున్న మార్పులో భాగమే. అంతే తప్ప కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు. ఇకపోతే తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. మరి ఇక్కడ బిజెపి ఓటు చోరీ చేయలేకనా అన్నది మమతా బెనర్జీ చెప్పాలి. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బిజెపి ఎంతగా పాకులాడినా తమిళనాట ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరించారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగపెట్టుకుంది. ఇవన్నీ మరచిన మమత తానేదో పునీతురాలినని చెప్పుకోవడం, సిఎంగా రాజీనామా చేయనని ప్రకటించుకోవడం అహంకారంతో కూడిన అవివేకానికి నిదర్శనం. అలా చేస్తే బర్తరఫ్ చేయడం తప్ప మరోమార్గం ఉండదు.

# నెల్లిపాకలో పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రేగా...

**అక్షర కలం/ పినపాక.**

శివపురం మండలం కి చెందిన నెల్లిపాక గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల వివాహము అయినటువంటి నూతన వధూవరులను ఆశీర్వదించి, పలు కుటుంబాలను పరామర్శించారు.ఇటీవల వివాహం జరిగిన అమరపురి ప్రకాష్, అరుణ దంపతుల కుమారుడు అమరపురి సందీప్ కుమార్,స్వాతి నూతన వధూవరులను గురువారం స్వయంగా వారి ఇంటికి వెళ్లి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగ తుపాకుల రాము సుభద్ర ల ఇల్లు అకాల వర్షాల కారణంగా దెబ్బ తిన్నందున వారి కుటుంబ సభ్యులను పరామర్శించా రు.అలాగే ఆ గ్రామ సర్పంచ్ తండ్రి గారైన ముంద్రు రాంబాబు ఇటీవల కంటికి ఆపరేషన్ చేయించుకున్నారు, చెంచలపు వెంకటరమణ భార్య చెంచెలపు లక్ష్మి ఇటీవల ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు వారిని కూడా పరామర్శించి,ఇటీవల



మరణించిన తుళ్లూరి మహాలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించ డం జరిగింది.గ్రామపంచాయతీ ఆరవ వార్డు మెంబర్ తులసి తల్లి అనారోగ్యంగా ఉన్నందున వారి కుటుంబాన్ని కూడా కలిసి ప్రమర్శించి ధైర్యంగా ఉండాలని,పార్టీ మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ యాదవ్,నెల్లిపాక సర్పంచ్ ముంద్రు వెంకట రామకృష్ణ, ఉప సర్పంచ్ అమరపురి మహేష్, మండల పార్టీ బిసి సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివారపు డాక్టర్ బాబు, గ్రామపంచాయతీ రెండవ వార్డ్ మెంబర్ జక్కుల జోగమ్మ, ఆరవ వార్డు మెంబర్ మద్దిపాటి తులసి,8వ వార్డు మెంబర్ బిట్రా నరసింహారావు, సీనియర్ నాయకులు కనకమేడల కోటేశ్వర రావు,బెల్లం వెంకటేశ్వ రరావు,చావా రాఘవులు,నెల్లిపాక మాజీ సర్పంచ్ గొర్రె ముచ్చు వెంకటరమణ,మాజీ ఎంపీటీసీ మరియు గ్రామ శాఖ అధ్యక్షులు గొర్రె ముచ్చు వెంకట రమణ,గ్రామ శాఖ బీసీ సెల్ అధ్యక్షులు పగిళ్ల సూర్య నారాయణ,బీసీ సెల్ ఉపాధ్యక్షులు చంచలపు వెంకటరమణ,గ్రామ శాఖఎస్టీ సెల్ అధ్యక్షులు పెదిరెడ్ల నరేంద్ర,గ్రామ శాఖ మహిళ అధ్యక్షురాలు చామంచుల నాగమణి,గ్రామ శాఖ బీసీ సెల్ మహిళా అధ్యక్షురాలు చంచలపు ఉమాదేవి,గ్రామ శాఖ ఎస్సీ సెల్ అధ్యక్షులు గజ్జల నాగరాజు, చావాకోటయ్య, తదితరులు పాల్గొన్నారు..

# విద్య, వైద్య మౌళిక వసతుల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

జిల్లాలో కొనసాగుతున్న విద్య, వైద్య మౌళిక వసతుల అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలిసి విద్య, వైద్య రంగాల మౌళిక వసతుల



నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు.లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జిల్లాలో 15 జూనియర్ కళాశాలల మరమ్మతు పనులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ఇకపై నిర్వహించే ప్రతి సమీక్ష సమావేశానికి ప్రాజెక్ట్ వారీగా ఎదురవుతున్న సమస్యలను స్పష్టంగా నివేదికల్లో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్య మౌళిక వసతుల అభివృద్ధి పనుల్లో ఎదురయ్యే ఏవైనా సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో 50 లక్షలకు పైబడిన 11 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, తిరుమలాయపాలెంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకలకు విస్తరించడం, జిల్లాలో జరుగుతున్న 100 పడకల ఆసుపత్రుల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా 50 లక్షలకు పైబడిన 24 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని భవిత కేంద్రాల పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని, వైరా జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల టెండర్ ప్రక్రియను త్వరగా ముగించాలని తెలిపారు.కెజిబివి పనులను సమయానికి పూర్తి చేయడంతో పాటు నిధులను క్రమం తప్పకుండా వినియోగించాలన్నారు. 14 కేజీబీవీ పనులకు నాబార్డ్ నిధులు మంజూరైనందున పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ వై. వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ ఎం. యాకోబు, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ బుగ్గయ్య, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ టి. ఉమా మహేష్, ఆర్ అండ్ బి ఈఈ ఎం.ఎ. బషీర్, పీఆర్ ఈఈ యు. మహేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# మానవీయ, సాంఘిక శాస్త్రాల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న గీతం

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 2026-27 విద్యా సంవత్సరానికి గాను మానవీయ, సాంఘిక శాస్త్రాలలో యూజీ, పీజీ, పీహెచ్.డీ. కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని ఆ స్కూల్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.జాతీయ లేదా రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలలో పొందిన చెల్లుబాటు అయ్యే స్కోర్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, అలాగే గీతం ప్రవేశ పరీక్ష (గాట్-2026) ద్వారా కూడా అర్హత సాధించవచ్చని ఆయన తెలియజేశారు. మూడో దశ ప్రవేశ పరీక్ష ఈనెల 17న జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మే




14వ తేదీలోగా అధికారిక పోర్టల్ ద్వారా ఆన్ లైన్లో సమర్పించవచ్చన్నారు.యూజీ స్థాయిలో- సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జర్నలిజం అండ్ మీడియా స్టడీస్, సోషియాలజీ, సినిమాటిక్ ఆర్ట్స్ అండ్ డిజైన్లు ప్రధాన అంశం (మేజర్)గా బీ.ఏ. కోర్సును అందజేస్తున్నామని తెలిపారు. వీటిలో చేరిన విద్యార్థులకు వారు ఎంచుకున్న విభాగాలలో బలమైన పునాదిని అందించడంతో పాటు, వారి విశ్లేషణాత్మక, సృజనాత్మక, భావ ప్రకటనా నైపుణ్యాలను మెరుగుపరిచేలా ఆయా కోర్సులను రూపొందించామని తెలిపారు. లిబరల్ ఎడ్యుకేషన్ లో భాగంగా, విద్యార్థుల ఆసక్తి, ఆశయాల ఆధారంగా 600కు పైగా సబ్జెక్టుల కలయికలను ఎంచుకోవచ్చన్నారు.పీజీ స్థాయిలో- అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషులలో ఎం.ఏ. కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఇవి ఉన్నతమైన సైద్ధాంతిక పరిజ్ఞానం, పరిశోధనా సామర్థ్యాలు, ఆచరణాత్మక అనువర్తనాలపై దృష్టి పెడతాయన్నారు.ఇక డాక్టోరల్ కోర్సులలో- అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్, సోషియాలజీలలో పీహెచ్.డీ. కోర్సులు ఉన్నాయని ఆయన తెలియజేశారు. ఈ రంగాలలో ఉన్నత-నాణ్యత గల పరిశోధన, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడమే వీటి లక్ష్యమన్నారు. విద్యతో పాటు క్రీడలు, ఇతరత్రా కార్యకలాపాలు, సామాజిక పరస్పర చర్యలతో అనుసంధానించడం ద్వారా సంపూర్ణ విద్యకు జీఎస్ హెచ్ఎస్ ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ శామ్యూల్ వివరించారు. అత్యాధునిక బోధనా ప్రయోగశాలలు, విస్తృతమైన ఇంటర్న్‌షిప్ అనుభవం, పరిశోధనపై దృష్టి సారించే అధ్యాపక బృందం సమగ్రమైన బోధనను అందించడంలో సహాయపడుతుందని తెలిపారు. విద్యాపరమైన విజయాలకు అతీతంగా విద్యార్థులను తీర్చిదిద్ది, విజ్ఞానవంతమైన దృక్పథాలు, విమర్శనాత్మక ఆలోచనల ద్వారా సమాజానికి అర్థవంతంగా దోహదపడేలా వారికి సాధికారత కల్పించడానికి గీతం కట్టుబడి ఉందన్నారు.గీతంలోని దాదాపు 33 శాతం మంది విద్యార్థులు ప్రతిభ ఆధారిత ఉపకార వేతనాలు పొందుతున్నారని, వీటిలో బోధనా రుసుము, భోజనం, వసతి ఖర్చులతో సహా పూర్తి మినహాయింపులున్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకుని, మే 17న జరిగే ప్రవేశ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇతరత్రా సమాచారం కోసం ఏఏఏ.ర్రఖుఎ.వంబ ను సందర్శించాలని, లేదా 888 4984 000 ను సంప్రదించాలని సూచించారు.

# ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి... అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మే 13 నుండి ప్రారంభమయ్యే పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు.పరీక్షా కేంద్రాల దగ్గర జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష ప్రశ్నపత్రాల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇంటర్ అడ్వాన్స్డ సప్లిమెంటరీ పరీక్షలకు మొదటి సంవత్సరం 10,344 మంది, ద్వితీయ సంవత్సరం 3562 మంది మొత్తం 13906 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. మొత్తం 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీఐఈఓ కె. రవిబాబు, డిఈసి సభ్యులు ఎం సింహాచలం, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, టిజిఎస్పీడిసీల్, ఆర్టీసీ, గురుకుల డిసిఓ, ఆర్సిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రైతులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలి

**మందమర్రి, మే 07 అక్షర కలం:**


రైతులు వడ దెబ్బకు గురికాకుండా తమను తాము రక్షించుకునేందుకు జాగ్రత్తలు వహించాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని గుడిపల్లి, పొన్నారం గ్రామాల్లో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులకు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ, ప్రస్తుతం పెరిగిన ఎండ తీవ్రత దృష్ట్యా రైతులు వరి కోతలు చేపట్టు సమయంలో, వరి కళ్ళల్లో ధాన్యాన్ని ఆరబెట్టు సమయంలో వడదెబ్బ నుండి రక్షించుకొనుటకు ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత మాత్రమే వివిధ రకాలైన పనులు చేసుకోవాలని సూచించారు. శరీర ఉష్ణోగ్రతలు సమతుల స్థితిలో ఉంచుకొనుటకు ప్రతి అరగంట నుండి 45 నిమిషాలకు ఒకసారి తగినంత నీరు తీసుకోవాలని, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని



తెలిపారు. డీహైడ్రేషన్ నుండి కాపాడుకొనుటకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని, తగినంత నీటి తోపాటు నిమ్మరసాన్ని సేవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నారం గ్రామ సర్పంచ్ పెంచాల మధు, ఇందిరా క్రాంతి పథం ఏపిఎం చంద్రశేఖర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్ చారి, కొనుగోలు కేంద్రం బాధ్యులు నల్లెల్లి తిరుమల, సల్లూరి పావని, రైతులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట





# ఢిల్లీ మ్యాచ్‌కు ఎంఎస్ ధోనీ దూరం!

ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు ఒక బ్యాడ్ న్యూస్. టీమ్ స్టార్ ప్లేయర్, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఇంకా పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ సాధించలేదు. మంగళవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగబోయే మ్యాచ్‌కు అతను అందుబాటులో ఉండటం లేదు. ఈ విషయాన్ని సిఎస్‌కే బౌలింగ్ కన్సల్టెంట్ ఎరిక్ సైమన్స్ ప్రీ-మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అధికారికంగా వెల్లడించాడు. ధోనీ కాఫ్ ఇంజూరీ నుంచి కోలుకుంటున్నాడని, అయితే ప్రస్తుతానికి అతను టీమ్‌తో కలిసి ఢిల్లీకి ప్రయాణించలేదని సైమన్స్ క్లారిటీ ఇచ్చాడు. ధోనీ ఎప్పుడు ఆడతాడు అనే విషయంపై అడిగిన ప్రశ్నకు సైమన్స్ ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చాడు. ధోనీ అప్‌డేట్ ఇవ్వడం తన స్థాయికి మించిన విషయమని, అతను ప్రస్తుతం తమతో లేడు కానీ క్రమంగా కోలుకుంటున్నాడని తెలిపాడు. ఎప్పుడు సిద్ధంగా ఉండాలో అతనికి బాగా తెలుసని, సిద్ధంగా ఉన్నప్పుడు ఖచ్చితంగా బరిలోకి దిగుతాడని సైమన్స్ పేర్కొన్నాడు.

# రఘు శర్మ ఎమోషనల్ సెలబ్రేషన్..

ఐపీఎల్ లో సోమవారం లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ ఒక అరుదైన దృశ్యానికి వేదికైంది. ముంబై ఇండియన్స్ తరపున డెబ్యూ చేసిన స్పిన్నర్ రఘు శర్మ తన మొదటి వికెట్‌ను వెరైటీగా సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతను లక్నో బ్యాటర్ అక్షత్ రఘువంశీని అవుట్ చేసి తన కెరీర్‌లో ఫస్ట్ ఐపీఎల్ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. వికెట్ తీసిన వెంటనే రఘు తన జేబులోంచి ఒక చిన్న కాగితం తీసి స్టాండ్స్ వైపు చూపిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆ నోట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. రఘు శర్మ చూపించిన ఆ నోట్ మీద ఎంతో ఎమోషనల్ మెసేజ్ ఉంది. "రాధే రాధే.. గురుదేవుల దైవ కృప వల్ల నా 15 ఏళ్ల సుదీర్ఘమైన బాధాకరమైన నిరీక్షణ ఈరోజుతో ముగిసింది. నాకు ఈ అద్భుతమైన అవకాశం ఇచ్చిన ముంబై ఇండియన్స్ (బ్లూ అండ్ గోల్డ్) టీమ్ కు ఎప్పటికీ రుణపడి ఉంటాను. జై శ్రీరామ్" అని అందులో రాసి ఉంది. లక్నో ఇన్నింగ్స్ 13వ ఓవర్ లో రఘు తన బౌలింగ్ లోనే రిటర్న్ క్యాచ్ పట్టి అక్షత్ ను అవుట్ చేశాడు. ఈ మూమేంట్ కోసం అతను దాదాపు 15 ఏళ్లుగా కష్టపడుతున్నట్లు ఆ నోట్ ద్వారా స్పష్టమైంది. ముంబై ఫ్రాంచైజీ తనపై నమ్మకం ఉంచి ఛాన్స్ ఇవ్వడం పట్ల అతను చాలా ఎమోషనల్ అయ్యాడు. రఘు శర్మ సెలబ్రేషన్ చూస్తుంటే ఐపీఎల్ అనేది కేవలం ఆట మాత్రమే కాదు, ఎంతోమంది కల అని అర్థమవుతోంది. 15 ఏళ్ల తర్వాత అతను సాధించిన ఈ విజయం యువ క్రికెటర్లకు ఒక ఇన్స్పిరేషన్ అని చెప్పొచ్చు. మరోవైపు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉన్న లక్నో సూపర్ జెయింట్స్ ఈ మ్యాచ్ లో బ్యాట్‌తో చెలరేగింది. రిషబ్ పంత్ నాయకత్వంలోని లక్నో టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోరు సాధించింది. వెస్టిండీస్ పవర్ హిట్టర్ నికోలస్ పూరన్ ఈ సీజన్ లో తన మొదటి హాఫ్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. కేవలం 21 బంతుల్లోనే 63 పరుగులు చేసి ముంబై బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. ఓపెనర్ మిచెల్ మార్ష్ కూడా 44 పరుగులతో రాణించి జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. లక్నో టీమ్ కి ఇది తొమ్మిదో మ్యాచ్ కాగా, ఈసారి బ్యాటర్లు పక్కా ప్లాన్ తో గ్రౌండ్ లోకి దిగినట్లు కనిపించింది.లక్నో టీమ్ భారీ స్కోరు చేసినప్పటికీ కెప్టెన్ రిషబ్ పంత్ ఫామ్ మాత్రం ఆందోళన కలిగిస్తోంది. ఈ మ్యాచ్ లో పంత్ కేవలం 15 పరుగులు మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. ఈ సీజన్ లో అతను నిలకడగా రాణించలేకపోతున్నాడు. అయితే చివర్లో ఐడెన్ మార్క్రమ్ (31 నాటౌట్), హిమ్మత్ సింగ్ (40 నాటౌట్) ధాటిగా ఆడటంతో లక్నో స్కోరు 200 దాటింది.



# ముంబై రికార్డు ఛేజింగ్..



ఐపీఎల్ లో ముంబై ఇండియన్స్ అద్భుతం చేసింది. 19 ఏళ్ల తమ చరిత్రలో అత్యధిక ఛేజింగ్ ను నమోదు చేసింది. సోమవారం సొంతగడ్డ వాంఖెడే స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై 6 వికెట్లతో ఘనవిజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 228 పరుగులు చేసింది. మిడలార్డర్ బ్యాటర్ నికోలస్ పూరన్ స్టన్నింగ్ ఫిఫ్టీ (21 బంతుల్లో 63, 1 ఫోర్, 8 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో కార్బిన్ బోష్ కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ ను 18.4 ఓవర్లలోనే 4 వికెట్లకు 229 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ సూపర్బ్ ఫిఫ్టీ (44 బంతుల్లో 84, 6 ఫోర్లు, 7 సిక్సర్లు)తో సిక్సర్ల సునామీ సృష్టించాడు. బౌలర్లలో సిద్ధార్థ్ కు రెండు వికెట్లు దక్కాయి.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# సినిమా
CINEMA

# విజయ్ విజయంతో మారిన సీన్

## జననాయగన్ విడుదలకు క్లీయర్ కానున్న లైన్

తమిళ స్టార్ హీరో జోసెఫ్ విజయ్ సినీ ప్రయాణంలో అత్యంత కీలకంగా నిలిచిన చిత్రం 'జన నాయగన్' ఇప్పుడు ఇండియన్ సినిమా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను తన ఆఖరి చిత్రంగా ప్రకటించిన విజయ్, ఇకపై పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టనున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఏర్పడింది. ప్రతిభావంతుడైన దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రం అసలు ఎన్నికలకు ముందు విడుదల కావాల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. నిర్మాణంలో ఆలస్యం, రాజకీయ పరిస్థితులు, అలాగే అనుకోని అడ్డంకులు 'జన నాయగన్' ప్రయాణాన్ని కష్టతరం చేశాయి. ఇంతేకాకుండా, ఈ చిత్రానికి సంబంధించిన ఓటిటి డీల్ కూడా మధ్యలో నిలిచిపోయినట్లు ప్రచారం జరిగింది. అదే సమయంలో సినిమాపై ఉన్న హైప్ కూడా కొంత వరకు తగ్గిందనే అభిప్రాయాలు వినిపించాయి. ఈ పరిణామాలన్నీ కలిసి సినిమా ప్రభావం తగ్గిపోయిందనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే తాజా రాజకీయ పరిణామాలు 'జన నాయగన్'కు పూర్తిగా కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని పార్టీ ఘనవిజయం సాధించడంతో ఆయన అభిమానుల్లో అపారమైన ఉత్సాహం కనిపిస్తోంది. ఒక హీరోగా మాత్రమే కాకుండా, నాయకుడిగా కూడా విజయ్‌పై ఉన్న విశ్వాసం ఇప్పుడు మరింత బలపడింది. ఇప్పటికే గతంలో 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం' వంటి భారీ ప్రాజెక్ట్‌తో విజయ్ తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించారు. భారీ బడ్జెట్, భారీ అంచనాల మధ్య వచ్చిన ఆ సినిమా కూడా అనుమానాలను చెరిపేసి మంచి వసూళ్లు సాధించింది. ఇప్పుడు అదే స్థాయిలో, అంతకంటే ఎక్కువగా 'జన నాయగన్'పై అంచనాలు నెలకొన్నాయి.ముఖ్యంగా, ఒక నటుడు ముఖ్యమంత్రిగా మారిన తర్వాత విడుదలవుతున్న అతని ఆఖరి సినిమా కావడం ఈ చిత్రానికి అదనపు క్రేజ్ తీసుకొచ్చింది. అభిమానులు ఈ సినిమాను కేవలం సినిమాగా కాకుండా, ఒక భావోద్వేగంగా చూస్తున్నారు. తమ హీరో రాజకీయాల్లో విజయం సాధించిన ఆనందంలో, ఈ సినిమాకు అపారమైన ఓపెనింగ్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. బాక్సాఫీస్ ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, 'జన నాయగన్' ఓపెనింగ్స్ కోలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా రికార్డులు బద్దలు కొట్టే అవకాశముంది. మొదటి రోజు వసూళ్లు ఊహించలేనంత స్థాయిలో ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఒకవేళ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, వసూళ్లు ఎక్కడ ఆగుతాయో అంచనా వేయడం కూడా కష్టమవుతుంది.






# విశ్వంభర బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్

## హరిగౌరవకు అప్పగించిన చిత్రబృందం

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా సోషియో-ఫాంటసీ చిత్రం విశ్వంభరపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న చిరంజీవి, ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'బింబిసార'తో సక్సెస్ అందుకున్న దర్శకుడు మల్లిడి వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. పురాణాల నేపథ్యంలో 14 లోకాల కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విజువల్ వండర్‌గా నిలవనుందని చిత్రబృందం చెబుతోంది. లోకాలను కాపాడే రక్షకుడిగా చిరంజీవి వింటేజ్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. ఈ సినిమాలో చిరంజీవికి జోడీగా త్రిష కృష్ణన్ నటిస్తోంది. దాదాపు దశాబ్దం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటం విశేషం. అలాగే ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జూలై 10న ఈ చిత్రం విడుదలయ్యే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో ఆసక్తికర మార్పు చోటుచేసుకుంది. ఇప్పటికే ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం, నేపథ్య సంగీతం బాధ్యతలను యువ సంగీత దర్శకుడు హరి గౌరకు అప్పగించినట్లు తెలుస్తోంది. పాటల కంపోజిషన్‌ను కీరవాణి చూసుకుంటుండగా, భారీ యాక్షన్ సన్నివేశాలు, ఫాంటసీ ఎలిమెంట్స్‌కు పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించే బాధ్యతను హరి గౌర తీసుకున్నారని సమాచారం. ఇప్పటికే ఆయన తన పనిని ప్రారంభించారని సినీ వర్గాలు చెబుతున్నాయి. హరి గౌర గతంలో చేసిన ప్రాజెక్టులు ఆయన ప్రతిభను నిరూపించాయి. ముఖ్యంగా హనుమాన్ చిత్రానికి అందించిన సంగీతం మంచి ప్రశంసలు అందుకుంది. అలాగే 'మిరాయ్' వంటి సినిమాలకు ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. మెలోడీస్‌తో పాటు గూస్‌బమ్స్ తెప్పించే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇవ్వడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో 'విశ్వంభర'లో హరి గౌర ఎంట్రీ సినిమాకు మరో ప్లస్ పాయింట్‌గా మారనుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. భారీ విజువల్స్‌తో వస్తున్న ఈ చిత్రానికి ఆయన ఇచ్చే నేపథ్య సంగీతం ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ధాన్యం కొనుగోలులో దగా

## రైతుల నెత్తి మీద శఠగోపం.!

### కొనుగోలు కేంద్రాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

### అధికారుల నిర్లక్ష్యం వీడకుంటే కలెక్టరేట్ ముట్టడి తప్పదని హెచ్చరిక

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

నల్గొండ నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే ఉద్యమం తప్పదని మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన నియోజకవర్గంలోని ఆర్జాలబావి, దండంపల్లి, ఎస్ఎల్ బి సి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ?ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను వెళ్ళబోసుకున్నారు. ధాన్యం కేంద్రాలకు వచ్చి 50 రోజులు గడుస్తున్నా.. నేటికీ సగం సేకరణ కూడా పూర్తి కాలేదని వారు వాపోయారు. బస్తాకు సాధారణం కంటే ఎక్కువగా 42 కిలోల 700 గ్రాముల తూకం వేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు. ప్రతి బస్తాకు 3 రూపాయల వరకు అదనంగా మామూళ్లు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. తూకం వేసిన వెంటనే అధికారులు ట్రక్ షీట్లు ఇవ్వడం లేదని, మిల్లుల దగ్గరకు వెళ్ళాక తూకం తక్కువ వచ్చిందనే నెపంతో పాత షీట్లను మార్పించి మరీ రైతులను నష్టపరుస్తున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం కాకుండా, తమకు ఇష్టమైన వారికే ముందుగా తూకం వేస్తూ సామాన్య రైతులకు కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.





#### కాంగ్రెస్ పాలనలో మిల్లర్లదే రాజ్యం...

కేంద్రాలను పరిశీలించిన అనంతరం కంచర్ల భూపాల్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసింది. కానీ నేడు కాంగ్రెస్ నాయకులు, మంత్రులు, అధికారులు మిల్లర్లతో కుమ్మక్కై రైతుల రక్తాన్ని తాగుతున్నారు. జిల్లా మంత్రులు ఈ అక్రమాలను చూస్తూ కూడా మౌనంగా ఉండటం సిగ్గుచేటని విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఎటువంటి నష్టం జరిగినా సహించేది లేదని, సమస్యలు పరిష్కరించకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల వెంట నగర పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, మండల పార్టీ అధ్యక్షులు దేప వెంకట్ రెడ్డి, నారబోయిన బిక్షం, తుమ్మల లింగస్వామి, బొజ్జ వెంకన్న, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, పెరిక యాదయ్య, పేర్ల అశోక్, దొడ్డి రమేష్, బాణావత్ దీప్లా, గోపగోని స్వాతి రాజశేఖర్, కుందూరు దీపిక ప్రవీణ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు జిల్లావ్యాప్తంగా పశు వైద్య ఆరోగ్య శిబిరాలు

### 33 మండలాల్లో ఏర్పాట్లు

### జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ జివి.రమేష్

అక్షరకలం నల్గొండ

జిల్లాలోని రైతుల సంక్షేమం కోసం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నేడు భారీ పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ జి.వి. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మొత్తం 33 మండలాల్లో ఈ శిబిరాలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

#### శిబిరాల్లో అందించే సేవలు...

ఈ శిబిరాల ద్వారా పశువులకు కేవలం వైద్యం అందించడమే కాకుండా, రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై కూడా అవగాహన కల్పిస్తారు. అనారోగ్యంతో ఉన్న పశువులకు గర్భకోశ సంబంధిత (పునరుత్పత్తి) సమస్యలతో బాధపడుతున్న పశువులకు ప్రత్యేక చికిత్స. కృత్రిమ గర్భధారణ పద్ధతి ద్వారా జన్మించిన మేలుజాతి దూడల ప్రదర్శన.
తీవ్రమైన ఎండల దృష్ట్యా వేసవిలో పశువుల సంరక్షణ, యాజమాన్య పద్ధతులు.

#### అధిక దిగుబడినిచ్చే పశుగ్రాసాల సాగు విధానాలు.

పాడి పరిశ్రమను లాభదాయకంగా మార్చుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు.గొర్రెలు మేకల ఆరోగ్య పరిరక్షణపై సూచనలు. ?ఈ శిబిరాలు నేడు ఉదయం 7 గంటలకే ప్రారంభమవుతాయి. కావున, జిల్లాలోని పాడి రైతులు, గొర్రెల కాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రమేష్ కోరారు. తమ పశువులను, మేలుజాతి దూడలను శిబిరాలకు తీసుకువచ్చి నిపుణులైన డాక్టర్ల సలహాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రాణం మీదికి తెచ్చుకోకండి.. హెల్మెట్ తప్పనిసరి.!

### సిఐ రాజశేఖర్ రెడ్డి

### నల్గొండ వన్ టౌన్ పోలీసుల వినూత్న తనిఖీలు

### చలానాతో పాటు అక్కడికక్కడే హెల్మెట్ ధరిస్తేనే అనుమతి






అక్షరకలం నల్గొండ

నల్గొండ పట్టణ ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ కె. శివరాం రెడ్డి సూచనలతో వన్ టౌన్ పోలీసులు గురువారం భారీ తనిఖీలు చేపట్టారు. వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు.

#### స్పాట్ సెటిల్మెంట్...

సాధారణంగా హెల్మెట్ లేకపోతే చలానా వేసి పంపించే పోలీసులకు భిన్నంగా, వన్ టౌన్ పోలీసులు కొత్త పంథా అనుసరించారు. హెల్మెట్ లేకుండా పట్టుబడిన వారికి జరిమానా విధించడమే కాకుండా, వారి ఇంటి నుండి లేదా బయట నుండి హెల్మెట్ తెప్పించుకుని, ధరించిన తర్వాతే వాహనాన్ని ముందుకు వెళ్లనిచ్చారు.

#### అవగాహన కార్యక్రమం..

వాహనదారులను ఆపి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఐఎస్ఐ మార్క్ ఉన్న నాణ్యమైన హెల్మెట్లు మాత్రమే వాడాలని సూచించారు. ఈ సందర్భంగా సిఐ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ప్రాణాంతక చర్యల పట్ల హెచ్చరికలు జారీ చేశారు. చాలా ప్రమాదాల్లో తలకు తగిలే చిన్న గాయమే ప్రాణాలను బలితీసుకుంటోంది. మీ కుటుంబం కోసం మీరు సురక్షితంగా ఇంటికి చేరాలి. హెల్మెట్ ధరించడం బాధ్యతగా భావించండని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో వన్ టౌన్ ఎస్ఐలు కె. సతీష్, జె. సైదులు, బి. లచ్చి రెడ్డి, ఎన్. వెంకట నారాయణ, సిబ్బంది శ్రీనివాస రెడ్డి, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.కాగా కేవలం జరిమానాలకు పరిమితం కాకుండా, వాహనదారులతో హెల్మెట్లు తెప్పించి వారి భద్రతను నిర్ధారించిన పోలీసుల తీరును పట్టణ ప్రజలు విశేషంగా అభినందిస్తున్నారు.

# మహిళల ఆత్మరక్షణకు అస్త్రం పోష్ చట్టం

అక్షర కలం : చిట్యాల




చిట్యాల: మహిళల పనిస్థల భద్రత కోసం భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013పై మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డి ఈ సి ఉద్యోగినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని ప్రతి సంస్థ మహిళా ఉద్యోగులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం తప్పనిసరని పేర్కొన్నారు. 10 మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న ప్రతి సంస్థలో తప్పనిసరిగా అంతర్గత కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ?అత్యవసర సమయాల్లో మహిళలు టోల్ ఫ్రీ నెంబర్లు 181, 100లను సంప్రదించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ లావణ్య కుమారి, ఏసీడీపీఓ వెంకటమ్మ, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగమణి, డి హెచ్ ఈ డబ్ల్యూ శ్రీదేవి, ధనలక్ష్మి మరియు డి ఈ సి ఉద్యోగినులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర సరిహద్దును పరిశీలించిన ఎస్పీ నరసింహ



అక్షరకలం కోదాడ

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రధాన మార్గమైన జాతీయ రహదారి 65పై కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాపురం వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ నరసింహ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి ధాన్యం, ప్రభుత్వ పంపిణీ బియ్యం, పశువులు, మద్యం, ఇసుక తదితర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ చెక్‌పోస్ట్ కీలకంగా పనిచేస్తోందన్నారు. పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో 24 గంటలు అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఎస్పీ సూచించారు. తనిఖీల సమయంలో సామాన్య ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని కూడా ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకునేందుకు పటిష్ట నిఘా కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పండిన వరి ధాన్యాన్ని తెలంగాణలో అక్రమంగా విక్రయించే ప్రయత్నాలను కట్టడి చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, అనంతగిరి ఎస్సై నవీన్, ట్రాఫిక్ ఎస్సై అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు ఆత్మగౌరవం: ఎమ్మెల్యే బాలు నాయక్

అక్షరకలం దేవరకొండ

ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల ఆత్మగౌరవం పెరిగిందని, ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం చందంపేట మండలంలోని రేకులగడ్డ గ్రామంలో కవిత - డాకు నాయక్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని, రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లబ్దిదారుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని, గుమ్మానికి కట్టిన మామిడాకుల తోరణంలో పేద కుటుంబాల ఆత్మగౌరవం ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును కూడా ఆయన



ప్రారంభించారు.అనంతరం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతల ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ముఖ్య నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు --- 97 మంది హాజరు



అక్షరకలం చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో గురువారం ఎస్సీ కార్పొరేషన్ పథకాల కింద స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎంపిక ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11:00 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొని దరఖాస్తుదారుల అర్హతలను పరిశీలించారు. ఈ ఇంటర్వ్యూలో ఎంపీడీఓ ఎస్పి. జయలక్ష్మి, తెలిపిన వివరాల ప్రకారం మొత్తం నాలుగు విభాగాల్లో 117 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 97 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు అని,వీ హాజరైన వారిలో టూ వీలర్ ఈవీ వాహనాలకు 63 మంది దరఖాస్తుదారులకు గాను 53 మంది హాజరయ్యారు., త్రీ వీలర్ ప్యాసింజర్ వాహనాలకు 19 మంది దరఖాస్తుదారులకు గాను అందరూ హాజరయ్యారు. తీ వీలర్ గూడ్స్ వాహనాలకు 15 మంది దరఖాస్తుదారులకు గాను 9 మంది హాజరయ్యారు. సోలార్ యూనివర్సల్ పంప్ ఒక దరఖాస్తుదారుడు ఉండగా, వారు హాజరయ్యారు అని వెల్లడించారు.. ?మొత్తం మీద 97 మంది అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో హాజరుకాగా, 20 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ?ఈ ఎంపిక ప్రక్రియలో చిట్యాల ఎంపీఓ ఏ. కొటేష్, నల్గొండ ఎస్సీ కార్పొరేషన్ అధికారి కె. రామకృష్ణ చిట్యాల తాసిల్దార్ విజయ్ కుమార్ వీరితో పాటు వివిధ బ్యాంకు శాఖల మేనేజర పాల్గొన్నారు.

# ఈనెల 19 వరకు ఓపెన్ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువు

యాదాద్రి భువనగిరి అక్షర కలం



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫీజును, ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 19 లోగా చెల్లించాలని భువనగిరి స్టడీ సెంటర్ కో- ఆర్డినేటర్ డాక్టర్ గంజి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాల (స్టడీ సెంటర్ - 144) పరిధిలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులు రెండు, నాలుగు మరియు ఆరు సెమిస్టర్ లకు సంబంధించిన పరీక్షల ఫీజులను దగ్గరలోని మీ సేవా కేంద్రాల్లో గానీ ఆన్లైన్ సెంటర్ లో గానీ ఈనెల 19 లోగా చెల్లించాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు స్టడీ సెంటర్ జాక్టో బొజ్జ బాలయ్య, ఫోన్ 9000590545 లను సంప్రదించాలని ఆయన సూచించారు.

# విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### ---గూడూరు గ్రామ సర్పంచ్ బింగి అలివేలు మంగ

అక్షర కలం బీబీనగర్



వేసవి కాలంలో విద్యార్థులకు నిర్వహించే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గూడూరు గ్రామ సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం బీబీనగర్ మండలం గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లో వ వేసవి సెలవుల్లో విద్యార్థులకు "చెస్ ఆటల శిక్షణా శిబిరాన్ని" ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పాలకవర్గం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

## మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ కొండమల్లెపల్లి ధాన్యం కేంద్రంలో నిరసన



**అక్షరకలం దేవరకొండ**

ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ నల్గొండ జిల్లా మాజీ అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు. గురువారం కొండమల్లెపల్లి మండలం పెండిపాకుల గ్రామ పరిధిలోని బాబులా తండా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి, రైతుల గోడును విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనే దిక్కులేక రైతులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ధాన్యం సేకరణ ఎంతో వేగంగా జరిగేదని, నేడు గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్థితి కూడా ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. ప్రభుత్వం తరుగు పేరిట 2 కేజీలు, మిల్లర్లు మరో 3 కేజీల చొప్పున రైతులను దోచుకుంటున్నా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు వడ్లకు బోనస్ ఇస్తామన్న హామీ 'బోగస్'గా మారిందని రవీంద్ర కుమార్ ఎద్దేవా చేశారు. "పాలన చేతకాకుంటే రేవంత్ రెడ్డి దిగిపోవాలి.. ఢిల్లీ పర్యటనల వల్ల రైతులకు ఏం ఒరిగింది?" అని ఆయన నిలదీశారు. స్థానిక ఎమ్మెల్యే సోషల్ మీడియాకే పరిమితమయ్యారని, క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు మిల్లర్ల వద్ద కమిషన్లు తీసుకోవడం వల్లే రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఎలాంటి ఆంక్షలు లేకుండా, తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన సీపీఎం నాయకులు

## తేమ, తాలు పేరుతో తరుగు తీయరాదని డిమాండ్



**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

రైతులు పండించిన ధాన్యాన్ని తేమ, తాలు, తరుగు పేరుతో క్వింటాలుకు రెండున్నర నుండి నాలుగున్నర కిలోల వరకు తరుగు తీయడం వెంటనే విరమించుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి మండలం అనాజిపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సీపీఎం రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ సెంటర్లలో, మార్కెట్ కేంద్రాలలో రైతులకు ధాన్యం నిలువ కోసం షెడ్లు, టార్పాల్లు (కవర్లు), తాగడానికి నీళ్లు ఏర్పాటు చేయాలని, ఐకేపీ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి, మిల్లులకు తరలించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, మండల నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ రాయపురం సురేష్, మండల నాయకులు పాండాల మైసయ్య, జిట్ట అంజిరెడ్డి, శాఖ కార్యదర్శి కొడాలి కృష్ణ, నాయకులు పిట్టల వెంకటేష్, యండి.రఫీక్, గంగదారి భాను, రైతులు పన్నాల నరెందర్ రెడ్డి, బొల్లెపల్లి రామచంద్రం, గోగు పోషయ్య, బోయపల్లి దామోదర్ రెడ్డి, పిట్టల చంద్రయ్య, గడుసు నరేష్, శ్రీరాం చంద్రకళ, గోగు మంగమ్మ, బొల్లెపల్లి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

## ఎమ్మెల్యే కుంభం సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు




**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

భువనగిరి మున్సిపాలిటీ కో- ఆప్షన్ సభ్యులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ సభ్యులు మెజారిటీ గా ఉండడంతో కో- ఆప్షన్ సభ్యులు ఓటింగ్ లేకుండానే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన వారిలో బిసి సామాజిక వర్గం నుంచి బడుగు విజయ, ఎస్సీ సామాజిక వర్గం నుంచి పల్లెర్ల యాదగిరి, క్రిస్టియన్ మైనారిటీ వర్గం నుంచి బట్టు వరలక్ష్మి, ముస్లిం మైనారిటీ వర్గం నుంచి సుజాయత్ అలీ కౌసర్ లు ఉన్నారు.

# నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు







**అక్షర కలం బీబీనగర్**

బీబీనగర్ మండలం మక్త అనంతారం మరియు గూడూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు గురువారం నూతన గృహ ప్రవేశ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్ లు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు నూతన వస్త్రాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. మక్త అనంతారం గ్రామానికి చెందిన కనుకబోయిన నర్సింహ నూతన గృహ ప్రవేశం లో గ్రామ సర్పంచ్ దర్నాబోయిన కిలంధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొట్టోల శ్యాం గౌడ్, ఉప సర్పంచ్ గ్యార మనీషా వెంకటేష్, గ్రామ అధ్యక్షులు జంగయ్య, వార్డు సభ్యులు వర్మ, బోత్కూరి కలమ్మ సత్తయ్య, ధర్నా బోయిన శ్రీధర్, కిరణ్, బండమీది వెంకటేష్, బింగి ఐలయ్య, పాల్గొన్నారు. గూడూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్,ఉప సర్పంచ్ జాన సత్యనారాయణ, గ్రామ పెద్దలు గడ్డం బాల్ రెడ్డి, వార్డు సభ్యులు తూర్పు నూరి అశ్విని బాలరాజు గౌడ్, అంకర్ల శ్రీనివాస్,బింగి లావణ్య రమేష్, దోనకొండ రాములు, బద్దం వాసుదేవ్ రెడ్డి,కుశంగల దశరథ, ఈసారపు అచ్చయ్య గౌడ్, వనం వెంకటేష్ తదితరులు పాల్గొని ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# సౌర విద్యుత్‌తో రైతులకు రెట్టింపు ఆదాయం



**అక్షర కలం : చిట్యాల**

నల్గొండ జిల్లా ?చిట్యాల మండల పరిధిలోని గుండ్రంపల్లి రైతు వేదికలో '99 రోజుల ప్రభుత్వ ప్రగతి ప్రణాళిక'లో భాగంగా కుసుమ సోలార్ విద్యుత్‌పై విద్యుత్ మరియు వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్యాల విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ మాట్లాడుతూ సోలార్ పంప్‌సెట్లపై ప్రభుత్వం అందించే సబ్సిడీలను, రైతులు నేరుగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ సంస్థలే కొనుగోలు చేస్తాయని, దీని ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని అధికారులు వివరించారు. ?గ్రామ పంచాయతీలకు పెరుగుతున్న విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడానికి సోలార్ విద్యుత్ సరైన మార్గమని, ప్రభుత్వ భూములు లేదా కార్యాలయాలపై వీటి ఏర్పాటుకు అధికారులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నర్రా వినోద మోహన్ రెడ్డి, చిట్యాల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కాటం వెంకటేశం చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి, ఏఈ, ఏఓ గిరిబాబు, లక్ష్మీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే బాలు నాయక్

**అక్షరకలం దేవరకొండ**



ప్రజా పాలనలో నిరుపేదల సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యతనిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం మండలంలోని అంబటోనిగూడెం గ్రామంలో దామరాశెట్టి రాధ - ఆల్వాల్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, గ్రామ సర్పంచ్ హరి కృష్ణ, ఎంపీడీఓ దానియల్, హౌసింగ్ ూజు ఎల్లయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## దేవరకొండలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

**అక్షరకలం దేవరకొండ**

నల్గొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివ శంకర్ రెడ్డి గురువారం దేవరకొండ పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ ప్రాంగణంలోని శివ గంగా ట్రేడర్స్, తిరునాల రోటరీ ఆయిల్ మిల్, నందిని సంస్థలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ తనిఖీల లో సదరు సంస్థలు పలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లైసెన్స్ లేకపోవడం.. కనీస ఫుడ్ లైసెన్స్ లేకుండానే వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. లూజ్ ఆయిల్ విక్రయాలు.. 15 లీటర్ల టిన్ల నుండి



గానుగ యంత్రాల ద్వారా విడి ఆయిల్ విక్రయిస్తుండటాన్ని గమనించారు. అనుమానం ఉన్న మూడు రకాల ఆయిల్ నమూనాలను సేకరించి, విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి శివ శంకర్ రెడ్డి వ్యాపారస్తులకు పలు హెచ్చరికలు జారీ చేశారు. గానుగ కేంద్రాలలో కేవలం నాణ్యమైన వేరుశెనగలు, ఇతర ముడి పదార్థాలను మాత్రమే వాడాలి. వ్యాపార ప్రాంగణాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలి. ముడి పదార్థాల నిల్వ విషయంలో జాగ్రత్తలు వహించాలి. ప్రతి ఫుడ్ బిజినెస్ నిర్వాహకుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్ కలిగి ఉండాలి. ప్రజలు తమ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని లూజ్ ఆయిల్స్ (విడి నూనెలు) కొనుగోలు చేయవద్దని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఫ్లైఓవర్ రైలింగ్‌ను ఢీకొన్న స్కూటీ : యువకుడు మృతి

**అక్షర కలం : నకిరేకల్ నియోజకవర్గం**



నార్కట్ పల్లి మండలంలోని ఏపీ లింగోటం గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరొకరు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామానికి చెందిన ఘట్ట సందీప్ కుమార్ (26). ?ఘటన: సందీప్ కుమార్ తన స్నేహితుడు వంగా ప్రేమ్‌తో కలిసి స్కూటీపై విజయవాడకు వెళ్తుండగా, తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెనుక నుంచి వస్తున్న ఒక అపరిచిత వాహనాన్ని తప్పించబోయి, స్కూటీ అదుపుతప్పి రైలింగ్‌ను బలంగా ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో సందీప్ కుమార్ అక్కడికక్కడే మరణించగా, వెనుక కూర్చున్న ప్రేమ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనపై , మృతుడి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్ పల్లి ఎస్సై విష్ణుమూర్తి తెలిపారు.

# భూ భారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

భూ భారతి , రెవిన్యూ సదస్సు లలో వచ్చిన దరఖాస్తులు, సాదా బైనామా, ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ భూములు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి మండల తహసీల్దార్ లను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్ లో మండల తహసీల్దార్ లతో భూ భారతి, రెవిన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని అన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం బస్తాలను లారీల ద్వారా సకాలంలో మిల్లులకు తరలించాలన్నారు.



రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలనీ తెలిపారు. సాదా బైనమా దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ ,రెవిన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, మండల తహసీల్దార్ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# సమ్మర్ హాలిడేస్ క్యాంపు “స్నేహ” సమర్ధవంతంగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డిఆర్డిఓ నాగిరెడ్డి

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

బాలబాలికలకు స్నేహ సమ్మర్ హాలిడేస్ లో నిర్వహించే “స్నేహ” క్యాంపును విజయవంతంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న “స్నేహ -- సమ్మర్ హాలిడేస్ క్యాంప్” కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బాలికల భద్రత, పోషణ, సాధికారత మరియు ఆరోగ్య పరిరక్షణ లక్ష్యాలతో చేపడుతున్న “స్నేహ” కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో, సమర్ధవంతంగా అమలు చేయాలని సంబంధిత. అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలలోని కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తూ, వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ పెట్టి మంచి నడవకను పిల్లలకు నేర్పించాలని, తల్లిదండ్రులు క్రమశిక్షణతో ఉంటే పిల్లలు కూడా అదే క్రమశిక్షణతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమ విజయవంతానికి మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, పోలీస్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని






సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ సమ్మర్ హాలిడేస్ క్యాంపుల ద్వారా కిశోర బాలికలకు ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, పోషకాహారం, బాల్య వివాహాల నివారణ, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు మరియు నాయకత్వ లక్షణాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, కళా నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన శిక్షణలు కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి, వైద్య ఆరోగ్యశాఖ మనోహర్, జిల్లా సంక్షేమ శాఖ నరసింహారావు, జిల్లా విద్యా శాఖ సత్యనారాయణ, యువజన క్రీడలు ధనంజనేయులు, జిల్లా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పల్లవి, కోశాధికారి అలివేలు అన్ని మండలాల ఏపీఎంలు, అంగన్వాడీ టీచర్లు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సృజనాత్మకతను వెలికితీసేందుకు కళలు, క్రీడలు దోహదపడతాయి

## --ఎస్ఆర్ఎం విద్యాసంస్థల చైర్మన్ కేశినేని శ్రీదేవి

**అక్షరకలం కోదాడ**



విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు కళలు, క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎస్ఆర్ఎం విద్యాసంస్థల చైర్మన్ కేశినేని శ్రీదేవి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం, రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు డ్రాయింగ్, కవితా పఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఠాగూర్ వంటి మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు విజ్ఞానంతో పాటు కళారంగంలోనూ రాణించాలని కోరారు. చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఆరోగ్యం, క్రీడాస్ఫూర్తి, ప్రకృతి సంరక్షణ వంటి అంశాలను కళ్లకు కట్టినట్లు చిత్రించి ఆకట్టుకున్నారు. కవితా పఠనంలో తమ భావ వ్యక్తీకరణతో ప్రతిభను చాటారు. ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

## కఠిన శిక్ష విధించిన ప్రత్యేక న్యాయస్థానం

## సమర్థవంతమైన దర్యాప్తుతో న్యాయం జరిగిందన్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, మే 7 (అక్షరకలం):**

బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తికి మహబూబ్‌నగర్ ప్రత్యేక సెషన్స్ కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. బాధితురాలికి న్యాయం జరిగేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన పోలీసు అధికారులు, ప్రజా అభియోజకులను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అభినందించారు. మిడ్జిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన కుర్రావత్ రమేష్ (25)పై నేరం రుజువుకావడంతో ప్రత్యేక సెషన్స్ కోర్టు న్యాయమూర్తి తమన్ రాజరాజేశ్వరి గురువారం తీర్పు వెలువరించారు. నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. పోలీసుల వివరాల ప్రకారం... 2020 నవంబర్ 22న బాధిత బాలికపై నిందితుడు అఘాయిత్యానికి పాల్పడగా, మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేయగా, అప్పటి జడ్చర్ల రూరల్ సీఐ శివకుమార్ దర్యాప్తు చేపట్టి ఆధారాలను సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రత్యేక ప్రజా అభియోజకుడు ఎం.జాన్ బలమైన వాదనలు వినిపించారు. కేసులో 15 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరాన్ని రుజువు చేయడంలో కీలక పాత్ర పోషించారు. మిడ్జిల్ ఎస్‌హెచ్‌ఓ పర్యవేక్షణలో సీడీఓలు రమేష్, పీసీ-3229, శంకర్, పీసీ-2194, కోర్టు లైజనింగ్ ఏఎస్ఐ బాలకృష్ణ సమన్వయంతో సాక్షులను క్రమపద్ధతిలో కోర్టులో హాజరు పరచడంతో విచారణ వేగంగా పూర్తయ్యింది. పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని, బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తారని జిల్లా ఎస్పీ డి.జానకి స్పష్టం చేశారు.




# వైద్యరంగం బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07:**

ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ



పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో చెన్నూరు మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఆసుపత్రుల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, పనులు మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆరెకటిక సహా వెనుకబడిన బీసీ, ఎంబీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

## బీసీ మేధావుల సంఘం అత్యవసర సమావేశంలో డిమాండ్

**మహబూబ్‌నగర్, మే 7. అక్షర కలం :**

రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ పరంగా వెనుకబడిన బీసీ, ఎంబీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించాలని బీసీ మేధావుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. ప్రభాకర్ మాట్లాడుతూ ఆరెకటిక కులం సహా అనేక వెనుకబడిన కులాలు ఇప్పటికీ ప్రభుత్వ గుర్తింపు, ప్రాధాన్యం



కోసం ఎదురుచూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇంకా అనేక బీసీ కులాలకు కార్పొరేషన్లు లేకపోవడం బాధాకరమని, ఇప్పటికే ఉన్న కార్పొరేషన్లకు కూడా తగిన నిధులు లేకపోవడంతో ఆయా వర్గాల అభివృద్ధి నిలిచిపోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన కులాలపై సమగ్ర అధ్యయనం చేసి, అసెంబ్లీ మెట్లు కూడా ఎక్కని కులాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రత్యేకంగా ఆరెకటిక కులానికి చెందిన అనేక మంది కార్యకర్తలు, సామాజిక సేవకులు రాష్ట్ర అభివృద్ధికి సేవలందించినప్పటికీ వారికి సరైన గుర్తింపు దక్కడం లేదన్నారు. అలాంటి వెనుకబడిన కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంబీసీ కులాల అభ్యున్నతికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వంపై ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి పునాది అవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో భాగ్యలక్ష్మి, మల్లేష్, సుహాసిని, రమాదేవి తదితరులు మాట్లాడుతూ మహిళలకు కూడా రాజకీయ, సామాజిక రంగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. వెనుకబడిన వర్గాల మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేక పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ మేధావుల సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

**మందమర్రి, మే 07 అక్షర కలం:**

మండలంలోని చిర్రకుంట గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో సంద్ర వెంకటస్వామికి చెందిన ఇల్లు పూర్తిగా అగ్నికి దహనమైంది. చిర్రకుంట గ్రామానికి చెందిన సంద్ర వెంకటస్వామి నివాసంలో గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో మంటలు చేలరేగి, ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికుల సమాచారం మేరకు బెల్లంపల్లి ఫైర్ ఇంజన్ సిబ్బంది, స్థానిక ప్రజలు కలిసి మంటలను అదుపులోకి తీసుకురావడంతో చుట్టుపక్కల గృహాలకు మంటలు వ్యాప్తి చెందలేదు. ఈ ప్రమాదంలో వెంకటస్వామికి సుమారు పది లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. బాధితుడిని గ్రామ సర్పంచ్ రాంటెంకి శ్రీలత తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దల రాజయ్య, సిద్ధం జనార్ధన్, రాంటెంకి తిరుపతి, ఓదెలు, సంపత్ రావు లు సందర్శించి, పోలీస్, రెవెన్యూ, ఎంపీడీవో కు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) గణపతి రాథోడ్ సందర్శించి, పంచనామ నిర్వహించి, ప్రభుత్వపరంగా బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు



అత్యవసర సహాయం కింద 25 కేజీల బియ్యాన్ని, నిత్యవసర సరుకులు, 5000 రూపాయల నగదును ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గణపతి రాథోడ్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా వెంకటస్వామి కుటుంబాన్ని ఆదుకోవడం తోపాటు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్లి, వారికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని, వారికి ప్రభుత్వం నుండి నష్టపరిహారం సైతం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.




# శివాని పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**మందమర్రి, మే 07 అక్షర కలం:**

పట్టణంలో శివాని ఉన్నత పాఠశాల యాజమాన్యం, ప్రభుత్వ నిబంధనలను ధిక్కరిస్తూ శివాని శ్రీ రామ్ స్కూల్ పేరుతో అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తోందని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాధికారి రమేష్ రాథోడ్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ, అనుమతి లేకుండానే పాఠశాల భవనాన్ని మార్చి, పూర్తి కాని నిర్మాణాన్ని పాఠశాల భవనంగా చూపిస్తూ, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు సైతం లేవని, పత్రాలకే పరిమితమై, అనుమతులు పొందినట్లు అనుమానాలున్నాయని తెలిపారు. అదేవిధంగా పాఠశాల యాజమాన్యం చట్ట విరుద్ధంగా, అనుమతి లేకుండానే ఐఐటి, నీట్ ఫౌండేషన్, నవోదయ కోచింగ్, జూనియర్, డిగ్రీ కళాశాల పేర్లతో సైతం ప్రచారం చేస్తూ, విద్యార్థులను ఆకర్షిస్తున్నారని ఆరోపించారు. విస్తృతంగా పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాల తో తప్పుడు సమాచారం ఇచ్చి, అడ్మిషన్లు చేపడుతూ, ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గతంలో చేసిన ఫిర్యాదులకు కనీసం స్పందన సైతం లేకపోవడం శోచనీయమని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడుతున్న పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే ఉన్నత అధికారులను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.




# కాంగ్రెస్ - బి జె పి కుముక్కు రాజకీయలు చేస్తున్నాయి..

జగిత్యాల మే 7 (అక్షర కలం) జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అసందర్భంగా కే. టీ. ర్. పై విమర్శించడం సరికాదు..బండి సంజయ్ ఎప్పుడూ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించింది లేదు.. వారిద్దరి మధ్య ఉన్నా అంతర్గత ఒప్పందం ఏమిటో అర్థం కావడం లేదు.బహుశా కాందిశీకుల భూముల పై ఉన్న ఒప్పందం ఏమో..,? ఉన్నది మాట్లాడితే బండి సంజయ్ కి ఉలుకు ఎందుకు.. ఆయన మాట్లాడిన తీరును మానవత్వం ఉన్న ఎవ్వరు సమర్థించారు.. అందుకేజిల్లా నాయకులు ఖండించారు...అదేవిధంగా కౌశిక్ రెడ్డి కూడా కరీంనగర్ లోని మీూా గంగుల కమలకర్ కార్యాలయం లో ఖండించారు.. బండి సంజయ్ క్యాంప్ కార్యాలయం సమీపంలో జరిగిన గన్ కల్చర్ చూస్తే అసలు రాష్ట్రం లో శాంతి భద్రతా లు ఉన్నాయా..? రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోంశాఖ బాధ్యతలు చూస్తున్నారు.. బండి సంజయ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి ఇద్దరు కమ్మకు అయి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై దాడి కుట్ర లో భాగస్వాములు.. రాష్ట్రం లో అటవికపాలన కొనసాగుతుంది.. ప్రజాజీవితం లో పాత్రికేయుల సమావేశం లో మాట్లాడినవి మీకు నచ్చనిపక్షం లో మీరు చట్టపరం అయినా చర్యలు తీసువచ్చు.. ఇంకా ప్రతి 4విమర్శ చేయవచ్చు.. కానీ ఇలా దాడికి చేయడం సరికాదు..



# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలి ::

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..



జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో వరి ధాన్యం కొనుగోళ్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే ట్రక్ షీట్లు జెనరేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.మిల్లర్లు కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని ఖచ్చితంగా దింపుకోవాలని, ధాన్యం స్వీకరించిన అనంతరం మిల్లర్ల నుండి అకనాలెడ్జ్‌మెంట్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడినన్ని తేమ శాతం కొలిచే యంత్రాలు, గన్ని బ్యాగులు, తార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.రైతులకు నిర్ణీత గడువులోగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లలో ఎలాంటి జాప్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంగీత, జిల్లా పౌరసరఫరాల అధికారి, డిఎం సివిల్ సప్లై, డి ఆర్ డి ఓ, మార్కెఫెడ్,జిల్లా సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మంకు క్రికెట్ కళకు "రఘురాం" కసరత్తు

స్టేడియం వేటలో ఎంపీ రామసహాయం

రఘునాథపాలెం మండలం జింకల తండా, ఖమ్మం రూరల్ తల్లంపాడు వద్ద స్వయంగా గుట్టల పైకి ఎక్కి స్థలాల పరిశీలన





అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

ఖమ్మం: నగర సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కావాల్సిన సాధ్యాసాధ్యాలపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోరిక మేరకు..గురువారం ఆయన రఘునాధపాలెం మండలం జింకల తండా సమీపంలో గుట్టల ప్రాంతం, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద హైవే వెంట ఉన్న కొండల ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. స్టేడియం నిర్మాణానికి అనువైన స్థలం కోసం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు.

శ్రమకోర్చి.. గుట్టపైకి

స్టేడియం నిర్మాణానికి విశాలమైన, అనువైన భూమిని గుర్తించే క్రమంలో ఎంపీ రఘురాం రెడ్డి శ్రమను లెక్కచేయకుండా రాళ్లు, రప్పలతో నిండిన గుట్టపైకి కాలినడకన ఎక్కారు. ఎగుడుదిగుడు మార్గాల గుండా ప్రయాణించి, గుట్టపై నుంచి చుట్టుపక్కల ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఖమ్మం క్రీడాకారుల కలల ప్రాజెక్టు అయిన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు ఎంపీ తెలిపారు. ఈ పర్యటనలో...: జాయింట్ కలెక్టర్ శ్రీనివాస రెడ్డి, డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, రఘునాథపాలెం ఎమ్మార్వో ఎస్.శ్వేత, ఖమ్మం రూరల్ ఎమ్మార్వో విజయేందర్ రెడ్డి, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో చిక్కిన అటవీ శాఖ అధికారులు!

అక్షర కలం/ భద్రాచలం:

భద్రాచలం అటవీ శాఖ ఎఫ్ డి వో , సుజాత, చర్ల ఇన్చార్జి డిఆర్వో, కృష్ణయ్య, గురువారం ఏసీబీ వలకు చిక్కా రు. దీంతో భద్రాచలం అటవీ శాఖలో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బాధితుల నుండి రూ.3.5 లక్షల లంచం తీసుకుంటుండగా భద్రాచలం ఎఫ్‌డీవో సుజాత, చర్ల ఇంచార్జ్ డీఆర్‌వో కృష్ణయ్యల ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కున్నారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలోఈ దాడు లు నిర్వహించారు.తెలిసిన సమాచారం ప్రకారం... భద్రాది జిల్లా,చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతం లో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఆపనుల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని చెట్లను తొలగించారు. దానిపై కేసు నమోదు చేయ కుండా ఉండేందుకు భద్రాచలం ఎఫ్ డివో సుజాత, 10 లక్షల




రూపాయలు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం బాధితుడీ నుండి మొదటి విడుత గా 3.5 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ బీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో పోలీసు లు ఆమెతో పాటు చర్ల అటవీ శాఖ ఇన్చార్జి అధికారి కృష్ణయ్యను అదుపులోకి తీసుకున్నారు.

# చెక్ పోస్ట్ ల దగ్గర అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ నల్లపు లింగయ్య

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్,మే 07)

... ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలి, నెంబర్లను రిజిస్టర్ లో నమోదు చేయాలి. రబి సీజన్ లో వరి కొనుగోళ్ల సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు అక్రమంగా ధాన్యం రాకుండా నిరోధించేందుకు, అలాగే బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి జిల్లా పరిధిలో మొత్తం ఏడు చెక్పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటక, నారాయణపేట బోర్డర్ లోని కృష్ణ బోర్డర్ చెక్పోస్టును డిఎస్పీ నల్లపు లింగయ్య తనిఖీ చేసి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను, సిబ్బందిని పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డిఎస్పీ



మాట్లాడుతూ...ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వాహనాల పూర్తి వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైతే వీడియో రికార్డింగ్‌తో తనిఖీలు కొనసాగించాలని సూచించారు.అదేవిధంగా సరిహద్దు మార్గాలన్నింటిపై నిరంతర నిఘా ఉంచి, గ్రామీణ మార్గాలు సహా అన్ని ప్రవేశ దారుల్లో తనిఖీలు కట్టుదిట్టం చేయాలని తెలిపారు. అక్రమంగా వరి ధాన్యం రాకుండా, పశువుల అక్రమ రవాణా జరగకుండా ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు.ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో చెక్‌పోస్ట్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తగినంత మంచినీరు తీసుకోవాలని, వేడి నుండి రక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలని సూచించారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని డీఎస్పీ స్పష్టం చేశారు. డీఎస్పీ తో పాటు కృష్ణ ఎస్సై ఎస్ ఎం .నవీద్ ఉన్నారు.

# పేదరికాన్ని జయించి 'డాక్టర్' అయిన చైతన్య సాయి

డీసీఎం డ్రైవర్ కొడుకు అద్భుత విజయం

ప్రభుత్వ పాఠశాల నుంచి మెడికల్ కాలేజ్ వరకూ...

తల్లిదండ్రుల త్యాగానికి గర్వకారణమైన కుమారుడు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:







ఖమ్మం: కష్టపడి చదివే గుణం, కన్నవారి కష్టాన్ని తీర్చాలనే తపన ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా ముద్దాడవచ్చని ఖమ్మం బిడ్డ నామవరపు చైతన్య సాయి నిరూపించారు. ఖమ్మం నగరంలోని జహీర్‌పుర, గుట్టల బజార్ ప్రాంతానికి చెందిన నామవరపు చైతన్య సాయి తన కృషి, పట్టుదల, చదువుపట్ల ఉన్న మక్కువతో డాక్టర్‌గా ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పరిధిలోని మహబూబ్‌నగర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో అతి సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఈ యువకుడు బుధవారం సాయంత్రం డాక్టరేట్ పట్టా అందుకొని తన తల్లిదండ్రుల కలలను నిజం చేశాడు. తల్లి నామవరపు రేణుక గృహిణిగా, తండ్రి నామవరపు కోటయ్య డీసీఎం డ్రైవర్‌గా ఎన్నో కష్టాలు పడుతూ కుమారుడిని చిన్ననాటి నుంచే ప్రభుత్వ పాఠశాలలో చదివించారు. ఆర్థిక ఇబ్బందులు అడుగడుగునా ఎదురైనా, "చదువే భవిష్యత్తు" అనే నమ్మకంతో కుమారుడి విద్య కోసం తల్లిదండ్రులు చేసిన త్యాగం చివరకు ఫలించింది. చిన్నప్పటి నుంచే చదువులో మెరిట్ విద్యార్థిగా గుర్తింపు తెచ్చుకున్న చైతన్య సాయి, క్రమశిక్షణతో చదువుకుంటూ ప్రతి తరగతిలోనూ ప్రత్యేక ప్రతిభ కనబరిచేవాడు. పెద్దల పట్ల గౌరవం, లక్ష్యంపై అచంచల నమ్మకం, కష్టపడే స్వభావం అతడిని ఈ స్థాయికి తీసుకువచ్చాయి. దళిత కుటుంబానికి చెందిన చైతన్య సాయి ఎంతో పోరాటం చేసి మెడికల్ సీట్ సాధించాడు. అనంతరం కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ పరిధిలోని మహబూబ్‌నగర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో మెడిసిన్ విద్యను పూర్తిచేసి డాక్టర్‌గా పట్టా పొందాడు. డాక్టరేట్ పట్టా అందుకున్న క్షణంలో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఎన్నో కష్టాలను భరించి చదివించిన తమ కుమారుడు డాక్టర్‌గా ఎదగడం చూసి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. గుట్టల బజార్ ప్రాంతంలోనూ ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. స్థానికులు, బంధువులు, స్నేహితులు చైతన్య సాయికి శుభాకాంక్షలు తెలుపుతూ అతని విజయాన్ని గర్వంగా కొనియాడారు. "పేదరికం చదువుకు అడ్డంకి కాదు... పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు" అని చైతన్య సాయి విజయం మరోసారి నిరూపించింది. కష్టపడి చదివితే సమాజంలో గౌరవం, గుర్తింపు ఎలా వస్తాయో ఈ యువ డాక్టర్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో నామవరపు సైదమ్మ, కొత్తపల్లి వీరమణి, కుక్కల వసంత, కొత్తపల్లి ప్రసాద్, కొత్తపల్లి మేఘన, కొత్తపల్లి సంధ్య, హనీ తదితరులు పాల్గొని చైతన్య సాయిని అభినందించారు.

# సమస్యలకు స్పందిస్తు పరిష్కరిస్తున్న విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చందావత్ రమేష్ బాబు.

అక్షర కలం / ఇల్లందు.




మండలంలోని విజయ లక్ష్మినగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చందావత్ రమేష్ బాబు గ్రామపంచాయతీలోని ప్రతి చిన్న సమస్యకు స్పందించి సమస్య నివారణకు కృషి చేయడంతో ఆ గ్రామ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. నియోజకవర్గంలోని ఏకైక తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థి చందావత్ రమేష్ బాబు ప్రజలు ఫిర్యాదు చేసిన సమస్యలపై నే కాకుండా గ్రామపంచాయతీలో పలు విధులను తిరుగుతూ సమస్యలను గుర్తించి నివారణ చేస్తున్నారు. అందులో భాగంగానే గురువారం భగీరథ పైపులు లీకై ప్రజలకు సక్రమంగా నీరు అందకపోవడంతో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించి భగీరథ అధికారులతో గ్రామపంచాయతీ శాండిషన్ సిబ్బందితో లీకేజీ సమస్యలను నివారణకు కృషి చేసి లీకేజీని సరి చేయడంతో ప్రజలు ఉపశమనం పొంది సంతోషాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా గ్రామపంచాయతి శేషగిరి బస్తీలో ఇండ్ల ఇళ్ల మధ్య ఇరువైపుల కాలువ లేకపోవడంతో మురికి నీరు రహదారిపై కి రావడంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాల ఇబ్బందిని గమనించి రహదారికి సంబంధించి సైడ్ కాలువ పనులను నేడు ప్రారంభించారు. గ్రామపంచాయతీ పరిధిలోని వీధిలైట్లు ఎక్కడైతే లేవో గమనించి వీధిలైట్లను పెట్టించారు. ఇటీవల భగీరథ వాటర్ సంబంధించి ఐదు రోజులు బ్రేకప్ అవడంతో పంచాయతీ వాటర్ ట్యాంకు ప్రైవేటు వాటర్ ట్యాంకుల ద్వారా గ్రామ ప్రజలకు ఇబ్బంది లేకుండా మంచినీలను తెప్పించి ఇంటింటికి పంపిణీ చేయించారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఇల్లందు నియోజకవర్గ కన్వీనర్ ముద్ర వంశీ సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టి చందవత రమేష్ బాబును గెలిపించారు. విజయలక్ష్మి నగర్ సర్పంచిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి చందావత్ రమేష్ బాబు విజయనగర్ లక్ష్మి విజయ లక్ష్మీ నగర్ అభివృద్ధికి పాటుపడడమే కాకుండా తన గ్రామపంచాయతీలో అనేక ఇండ్లు కోల్పోయి నిర్వాసితులు అయితున్న సందర్భంగా వారికి న్యాయం చేసేందుకు అన్ని పార్టీ లను అఖిలపక్షంగా ఏర్పడి న్యాయం కోసం ముందుండి పోరాడుతున్నాడు. యువకుడిగా సౌమ్యుడుగా మంచి పేరున్న చందావత్ రమేష్ బాబు విజయ లక్ష్మి నగర్ సర్పంచ్ గా తన గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలోనడిపించి సర్పంచ్ గా నిలబెట్టిన ముద్రగడ వంశీకి, విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీ ప్రజలకు మంచి పేరును తీసుకొస్తాడని ఆశిద్దాం.

# 16వ వార్డు లబ్ధిదారులకు ఇందిరమ్మ పట్టాలను పంపిణీ చేసిన ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణమిత్ర డానియల్.

అక్షర కలం / ఇల్లెందు.

ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఆదేశాల మేరకు ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర ఆధ్వర్యంలో గురువారం ఇల్లందు మున్సిపాలిటీ కార్యాలయంలో ఇందిరమ్మ పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 16వ వార్డుకు చెందిన లబ్ధిదారులకు మున్సిపల్ కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర తో కలిసి పట్టాలను అందజేశారు.
ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణమిత్ర మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులకు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 16వ వార్డుకే 16 ఇళ్లు మంజూరు కాగా, అవన్నీ ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని ఆమె గుర్తు చేశారు.
16వ వార్డుకు ఇళ్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రెండో విడతలో కూడా 16వ వార్డుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఎమ్మెల్యే ను సభ ముఖంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ పెండెల రాజు, కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్ సందీప్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# యువత అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ముందుకు సాగాలి

మందమర్రి, మే 07 అక్షర కలం:



మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలకులను ఎదిరించి, సాయుధ పోరాటం చేసిన మన్యం ప్రాంత విప్లవ వీరుడని, నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని, దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుతం సింగరేణి ఎస్ అండ్ పిసి ఉద్యోగి రాజేష్ పివ్వాల్, ఆయన సతీమణి రాణి పివ్వాల్ లు పిలుపునిచ్చారు. పట్టణంలోని వారి నివాసంలో గురువారం అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని, సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు, దేశ స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని కొనియాడారు. సాయుధ పోరాటం తోనే దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన గొప్ప యోధుడని తెలిపారు. కేవలం 27 ఏళ్ళ వయస్సులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అతని అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొట్టాడని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావాలనే బలమైన సంకల్పంతో, గిరిజనులపై బ్రిటిష్ అటవీ చట్టాలు (పోడు సాగు నిషేధించడం) వల్ల జరిగిన అన్యాయాన్ని ఎదుర్కొంటూ, గిరిజనులను కూడగట్టి, బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సాయుధ పోరాటమే మార్గమని, బ్రిటిష్ సైన్యంపై గెరిల్లా పోరాటం సాధించిన గొప్ప వీరుడని కొనియాడారు. తెల్లదొరల వెన్నుల్లో వణుకు పుట్టించిన అల్లూరి సీతారామరాజును ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో బ్రిటిష్ బలగాలు మోహరించి, ఆయనను బంధించి, కాల్చి చంపారని తెలిపారు. నేటి యువత అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని, సేవా భావం, దేశభక్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పెందోట వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మంద మకరందు





అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07:

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ–ఉట్నూర్ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మంద మకరందు గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని డిసిపి కార్యాలయంలో డిసిపి ఎ భాస్కర్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07:

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు పూర్తి చేయాలని, జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి తప్పనిసరిగా శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమ బాధ్యతలను క్రమంగా నిర్వర్తిస్తూ, రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టి సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో తడిచిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అడిషనల్ కలెక్టర్ టి.ఎల్. సంగీత

సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..



సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) టి.ఎల్. సంగీత గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవల అమలు తదితర అంశాలపై స్వల్పంగా చర్చించారు.

# నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07:





ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి దాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రం, చెన్నూరు మండలం సోమనపల్లి, ఆస్నాద్ లలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు వి రాములు కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో రైతులు నిబంధనల ప్రకారం వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించి, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి త్వరగా మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయా కేంద్రాలలో రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రైతులు తాలు, తప్ప, మట్టి గడ్డలు, తేమ లేని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జైపూర్ మండలం ఇందారం లోని జయలక్ష్మి రైస్ మిల్, భీమారం మండల కేంద్రంలోని సమత ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను సందర్శించి కొనుగోలు కేంద్రాల నుండి కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 10 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం చెన్నూరు, భీమారం లలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇంటర్మీడియట్ గోదాములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోదాముల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07:

వరి ధాన్యం నిల్వచేసే గోదాముల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని కాసిపేట మండలం గుండ్లపహాడ్, బెల్లంపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం నిల్వ గోదాములను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, బెల్లంపల్లి తహశీల్దార్ కృష్ణ లతో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి తీసుకున్న ధాన్యాన్ని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గోదాములలో నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 10 రైస్ మిల్లులు పని చేస్తున్నాయని, సుముఖ్ గోదాం సామర్థ్యం 20 వేల మెట్రిక్ టన్నులు ఉండగా, ఇతర గోదాముల సామర్థ్యం మొత్తం 61 వేల మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. ఈ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తూ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రవాణా వాహనాలను మిల్లులకు తగిన విధంగా కేటాయించి, వరి ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూభారతి రెవెన్యూ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారం లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులతో సరిచూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధి ధ్యేయం.. ఎమ్మెల్యే...

## – జర్నలిస్టుల కాలనీలో అన్ని వసతులు కల్పిస్తాం.....

## – రూ.37.01 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు......

మెదక్/ కొల్చారం మే07( అక్షర కలం):-





మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధి ధ్యేయంగా ధ్యేయంగా ముందుకు పోతున్నామని జర్నలిస్టుల కాలనీకి అన్ని వసతులు కల్పిస్తామని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.గురువారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో సుమారు37.01 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు పనులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన



పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్ పట్టణ అభివృద్ధికి చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు.మెదక్ పట్టణాభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.గాముందుకు పోతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన పనులు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉన్నాయన్నారు. మెదక్ ప్రాంత ప్రజల అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. మెదక్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నిధులు మంజూరు చేస్తూ పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాలు గ్రామాలు మున్సిపాలిటీలో అంచెలంచెలుగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రూ.37.01 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పట్టణ ప్రాంత అవసరాలను గుర్తించి వారి కి మౌలిక వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని ఆయన అన్నారు. మెదక్ పట్టణంలోని ఆయా వార్డుల్లో రూ.37.01 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రోహిత్ శంకుస్థాపన చేశారు. టి యు ఎఫ్ ఐ డి సి, ఎస్ బి ఎం పథకాల కింద, మెదక్ పట్టణంలో 37.01 కోట్ల రూపాయల వ్యయంతో మెదక్ మున్సిపాలిటీలోని వివిధ వార్డులలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు మరియు స్లాబ్‌ల నిర్మాణంకు పనులను శంఖుస్థాపన చేశారు.వార్డు నెం. 1–ఔరంగాబాద్ ప్రాంతం బీసీ కమ్యూనిటీ హాల్ సమీపంలో సీసీ డ్రెయిన్‌లు, స్లాబ్‌లు మరియు రోడ్ల నిర్మాణంకు ?36 లక్షలు, వార్డు నెం. 2–అవుసులపల్లిమాధురి దేవయ్య ఇంటి సమీపంలో సీసీ రోడ్ల నిర్మాణం 32 లక్షలు, వార్డు నెం. 3లో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీల నిర్మాణం కోసం 30 లక్షలు, వార్డ్ నెం. 5–మిలిటరీ కాలనీ, జంబికుంట, ఇందిరాపురి కాలనీలు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సమీపంలో అభివృద్ధి పనులు 76 లక్షలు, వార్డు నెం 19– చర్చి ప్రాంతం 100 మంది సభ్యుల కోసం జీ o3 వసతి గృహ నిర్మాణంకు రూ.14.77 లక్షలు, వార్డు నెం. 6 అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డుపై సీసీ రోడ్ల నిర్మాణంకు రూ.39.50 లక్షలు, వార్డు నెం. 7 ఖుత్‌బిష్లాం మసీదు రోడ్డుకు సమీపంలో, వాటర్ ప్లాంట్ దగ్గర సీసీ రోడ్ల నిర్మాణం రూ.35 లక్షలు, వార్డు నెం. 28 కమ్యూనికాంత ఫోర్ట్ రోడ్డులో సిసి డ్రైనేజీలు మరియు రోడ్ల నిర్మాణం 30 లక్షలు, వార్డు నెం. 14– నవాపేట ప్రాంతంలో అభివృద్ధి పనులు 30 లక్షలు, వార్డు నెం. 12 2 బి హెచ్ కె ప్రెస్ కాలనీ ప్రధాన రహదారి ప్రవేశద్వారం వద్ద సీసీ డ్రెయిన్లు, స్లాబులు మరియు రోడ్ల నిర్మాణం 160 లక్షలు, వార్డు నెం. 13 15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన మొత్తం రూ.37.01 కోట్ల రూపాయల విలువైన మొత్తం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రాబోయే రోజుల్లో అరె నీ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు వస్తువులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రతి గ్రామంలో కిషోర బాలికల సంఘాలు

## ఏపీఎం శ్రీనివాస్, ఎంపీడీవో మహబూబ్ అలీ



**అక్షర కలం సిద్దిపేట మే 07**

ప్రతి గ్రామంలో 14 నుంచి18 ఏళ్ల బాలికలతో 'కిషోర బాలికల సంఘాలు'ఏర్పాటు చేయాలని ఏపీఎం శ్రీనివాస్ కోరారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన కన్వర్జెన్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పది మంది సభ్యులతో కూడిన ఈ సంఘాల ద్వారా బాలికలకు ఆరోగ్యం,పోషకాహారం,సైబర్ క్రైమ్,బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.వారిలో నాయకత్వ లక్షణాలు,ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'స్నేహ సమ్మర్ క్యాలెండర్'ను ప్రవేశపెట్టిందని, దీనిని అధికారులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ అలీ, డాక్టర్ శివకుమార్, హెడ్ కానిస్టేబుల్ సంపత్,ఐసీడీఎస్ రజిత,మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జూదంపై టాస్క్‌ఫోర్స్, పోలీసుల దాడి.....

- ఇద్దరు అరెస్ట్.. నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం.....
- అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు.....
- మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు....

**మెదక్ /కొల్చారం మే07(అక్షర కలం):-**



పాపన్నపేట మండలం అన్నారం గ్రామ శివారులోని ప్రకృతి వనం వెనుక పేకాట ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టైన వారిలో దర్శనం రాజు (32), దర్శనం వినోద్‌కుమార్ (29)లు ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,500 నగదు, రెండు సెల్‌ఫోన్లు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలో జూదం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సమన్వయంతో నిరంతరం దాడులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు.

# సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి ;

- ప్రభుత్వ పథకాల మీద అవగహన అవసరం
- "సురక్షితమైన బాల్యం, సురక్షితమైన భవిష్యత్తు"
- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్



**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్,మే 07)**

నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీపురం మరియు చిన్నజట్రం గ్రామలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఇట్టి విజ్ఞాన సదస్సుకు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ హాజరైన గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ "రైతు లేకపోతే దేశం లేదు" అంటారు. వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదు, ఇది ఒక సంస్కృతి, జీవన విధానం. మనకు కావాల్సిన ఆహారాన్ని అందించేది వ్యవసాయమే. రైతులు తమ పంట పొలాల యొక్క భూసార పరీక్షలు చేయించుకొని, పంటల బీమా చేయించి, నష్టాలను అధిగమించవచ్చని తెలిపారు. నిత్యవసర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపరచుకంటే నష్ట పరిహారం పొందే వెసలుబాటు ఉంటుందని చెప్పారు. బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుండి మంచి రక్షణ మరియు విద్యావకాశాలు కల్పిస్తే, వారి భవిష్యత్తు (దేశ భవిష్యత్తు) సురక్షితంగా ఉంటుంది అని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అన్నారు. ఇట్టి కార్యక్రమానికి భానుచందర్ (లక్ష్మీపురం గ్రామా పంచాయతీ సెక్రటరీ) మమత ( గ్రామా సర్పంచ్), సుజాత (చిన్నజట్రం గ్రామా పంచాయత్ సెక్రటరీ), జ్యోతి (గ్రామా సర్పంచ్) మరియు శ్యామప్ప (కానిస్టేబుల్) పాల్గొన్నారు.

# బీబీనగర్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**అక్షర కలం బీబీనగర్**



బీబీనగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హైదారాబాద్ నుంచి వరంగల్ (మహబూబ్ బాద్ ) వైపు వెళు న్న బైక్ ను స్విఫ్ట్ కారు వెనక నుంచి అతివేగంగా వచ్చి ఢీ కొనగా బైక్ పైన ఉన్న జాటోతు సతీష్ , భూక్యా వెంకటేష్ లకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన ఇద్దరిని స్థానికులు అంబులెన్స్ సాయంతో బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

# వ్యవసాయంలో టెక్నాలజీ ఉపయోగించుకోవాలి....

## - జిల్లా అదనపు కలెక్టర్ నగేష్....





**మెదక్/ కొల్చారం మే07(అక్షర కలం):-**

వ్యవసాయంలో నూతన టెక్నాలజీని అంది పుచ్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ రైతులకు సూచించారు.గురువారం కొల్చారం మండలం పోతం శెట్టిపల్లిలో జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వరము సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ మన దేశం వ్యవసాయ ఆధారిత దేశమని , రైతులు వ్యవసాయంలో నూతన టెక్నాలజీని అంది పుచ్చుకోవాలని పిలునిచ్చారు. నూతన వంగడాలు ,పనిముట్లు,యంత్రాలను ఉపయోగించి పంటల ఉత్పత్తి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, కొల్చారం తహసిల్దార్ శ్రీనివాస్ చారి , పోతంశెట్టిపల్లి సర్పంచ్ దయాకర్ గౌడ్, కొంగోడు సర్పంచి స్వామి, చిన్నారపు ప్రభాకర్ , సీనియర్ చిట్యాల యాదయ్య , వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మతసామరస్యంతో బక్రీద్ నిర్వహించాలి...

- ఖురేషి కులస్తులు, హిందూ సంఘాలతో సమావేశం...
- పశువుల అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్...
- మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు....

**మెదక్,/కొల్చారం మే07( అక్షర కలం):-**






మెదక్ జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో, మతసామరస్యాన్ని కాపాడేలా నిర్వహించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఖురేషి కులస్తులు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్, హిందూ వాహిని, శ్రీరామ్ సేన, హిందూ యువవాహిని సభ్యులతో వేర్వేరుగా అవగాహన సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సరైన అధికారిక అనుమతులు, పత్రాలు ఉన్న పశువులను మాత్రమే సంహరించాలని ఖురేషి కులస్తులకు సూచించారు. ఆవులను ఎట్టి పరిస్థితుల్లోనూ సంహరించవద్దని స్పష్టం చేశారు. పశువుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మాంసం నిల్వ చేసే ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించాలని, పక్షులు, కుక్కలు, కోతుల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, వ్యక్తులపై దాడులకు పాల్పడడం నేరమని హెచ్చరించారు. అక్రమంగా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామని చెప్పారు. పశువుల అక్రమ రవాణా శిక్షార్హమైన నేరమని, మూగజీవాలపై క్రూరత్వానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పశువుల రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్, కౌ స్లాటర్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గోరక్షణ పేరుతో దాడులు, వాహనాల ధ్వంసం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా వాటిని షేర్ చేయవద్దని ప్రజలకు సూచించారు. పశువుల అక్రమ రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, సీఐ లు జర్జ్, సందీప్ రెడ్డి, వెటర్నరీ డాక్టర్ లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది, మత పెద్దలు, పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకే పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత
- మందమర్రి సిఐ పర్సా రమేష్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07:**



నేరాలను నియంత్రించేందుకే పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మందమర్రి సిఐ పర్సా రమేష్ తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం జిల్లాలోని మందమర్రి పోలీస్ సర్కిల్ కాసీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తవారి పేట గ్రామంలో పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటిని తనిఖీ చేస్తూ, నివాసితుల వివరాలను సేకరించారు. అదే విధంగా గ్రామంలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చారా లేదా, అనుమానాస్పద వ్యక్తులు తలదాచుకున్నారా అనే కోణంలో విస్తరణ సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ పర్సా రమేష్ మాట్లాడుతూ, ప్రజలలో భద్రత భావాన్ని పెంపొందించడం, నేరస్తుల కదలికలపై నిఘా ఉంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారికి ఉక్కు పాదం మోపుతామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మధ్య సేవించి వాహనాలు నడపడం, అతివేగం వంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల కుటుంబాలు వీధిన పడుతున్నాయని, హెల్మెట్, సీట్ బెల్ట్ లు ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునని ఉదాహరణలతో వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని రకాల పత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మహిళలు, చిన్నపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ఏదైనా ఆపద కలిపితే వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామల రక్షణ కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, నేరాల అదుపులో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. రైతులు నకిలీ పత్తి విత్తనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ధృవీకరించిన విక్రేతల వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, వరకట్నం వంటి సామాజిక దుష్ప్రవర్తనలను నిరోధించాలని పిలుపునిచ్చారు. మానసిక ఒత్తిడి ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడాలని, అవసరమైతే కౌన్సిలింగ్ తీసుకోవాలని సూచించారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సరైన ధృవపత్రాలు, నెంబర్ ప్లేట్ లేని 38 ద్విచక్ర వాహనదారులు , 2 ఆటో యజమానులపై జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో కాసీపేట ఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అక్షరకలం APTELRNI No. 2009/27246

## కొండగట్టులో హనుమాన్ పెద్ద జయంతి వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు

కలగకుండా చర్యలు తీసుకోవాలి

అదనపు ఎస్పీ చేతన్ నితిన్





**జగిత్యాల మే 7 (అక్షర కలం)**

పుణ్యక్షేత్రం కొండగట్టులో ఈ నెల 10 నుండి 13 వరకు నిర్వహించనున్న హనుమాన్ పెద్ద జయంతి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జయంతి వేడుకల సందర్భంగా వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాలు, క్యూలైన్లు, మాలవిరమణ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలు, వాహనాల రాకపోకలు జరిగే మార్గాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. ఎలాంటి నేరాలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ భద్రతా ఏర్పాట్ల పరిశీలనలో అదనపు ఎస్పీ తో పాటు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఎస్.బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, సీఐలు రవి, సుధకర్,కరుణాకర్, ఎస్. ఐ నరేష్ పాల్గొన్నారు.

## బక్రీద్ వేళ శాంతిభద్రతలపై పోలీసుల ప్రత్యేక దృష్టి

మత పెద్దలు, మాంసం వ్యాపారులతో సమన్వయ సమావేశం

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు : వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య

**మహబూబ్‌నగర్, మే 7 (అక్షరకలం) :**



బక్రీద్ పండుగను ప్రశాంత, సామరస్య వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, చట్టబద్ధ విధానాల అమలు, సామాజిక సామరస్య పరిరక్షణ లక్ష్యంగా ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య నిర్వహించారు. ఈ సమావేశానికి మాంసం వ్యాపారులు, మత పెద్దలు, వివిధ వర్గాల ప్రతినిధులు హాజరయ్యారు. బక్రీద్ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు, చట్టాలను తప్పనిసరిగా పాటించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. జంతువుల కొనుగోలు, రవాణా, వధ ప్రక్రియలు అనుమతులు మరియు చట్టబద్ధ నిబంధనల ప్రకారమే నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆవులు, దూడలు లేదా నిషేధిత జంతువులను అక్రమంగా రవాణా చేయడం, వధించడం వంటి చర్యలు పూర్తిగా చట్టవిరుద్ధమని హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జంతువుల రవాణా సమయంలో సంబంధిత ధృవపత్రాలు, అనుమతులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. పండుగ సమయంలో ఎటువంటి అపోహలు, ఉద్రిక్తతలు, మత విద్వేషాలకు తావు లేకుండా పరస్పర గౌరవంతో వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, ప్రేరేపిత పోస్టులు, మార్ఫింగ్ ఫోటోలు షేర్ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు శాంతియుత వాతావరణ పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్--100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. బక్రీద్ పండుగను సామరస్యపూర్వకంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు చెల్లించండి:

**- బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు : వెంకటేష్ యాదవ్**

**(అక్షర కలం, నారాయణపేట్ జిల్లా రిపోర్టర్, మే 07)**



నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు డు. వెంకటేష్ యాదవ్, ఓట్ల కోసం బీసీల వెంట పడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని మోసం చేశారని ఆరోపించారు. ఫీజు బకాయిలు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల బీసీ విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మడివాలా కృష్ణ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ కార్యకర్తలకు 10 లక్షలు నగదు, పక్కిల్లు కట్టించడం, 3 ఎకరాల భూమి కల్పించడం, నెలకు 25 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సల్ల వెంకటేష్ మాట్లాడుతూ, పేద ప్రజలను ఆదుకోవాలని, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు కట్టించాలని, చంచార కులాల ప్రజలకు స్థిర నివాసం, ఉపాధి కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మడివాలా కృష్ణ, చల్ల వెంకటయ్య, మహేష్, సునీల్ యాదవ్ పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు అందరికీ 5లక్షల చొప్పున ఇందిరమ్మ బీమా పథకం త్వరలో అమలు చేయబోతున్నాం.. -ఎమ్మెల్యే సంజయ్ కుమార్





**జగిత్యాల రూరల్ మే7 (అక్షర కలం)**

మండలం పోలాస గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారం కార్యక్రమంలో భాగంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, విద్యుత్ శాఖ పి.ఏం. కుసుమ్ అన్నదాతలకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అనంతరం రైతు వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ పంపు సెట్ ను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్. పరిశీలించారు ఈసందర్భంగా పోలాస రైతువేదికలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు పథకంలో నిరుపేదలకు ఇళ్లు మంజూరు.పేద మధ్యతరగతి ప్రజలకు అందరికీ 200 యూనిట్ల ఉచిత కరెంటు. జగిత్యాల నియోజకవర్గం లో 78 వేల ఇళ్లకు ఉచిత కరెంట్ అమలు చేయడం జరుగుతుంది. పోలాస గ్రామంలో దాదాపు 1000 ఇండ్లకు ఉచిత కరెంట్గ్రామంలో 1800 మందికి రేషన్ కార్డులు ఉన్న వారికి సన్న బియ్యం పంపిణీ సోలార్ ఉపయోగంతో పర్యావరణానికి హాని కలగకుండా విద్యుత్ ఉత్పత్తి .ప్రజలు నూతన అవకాశాలు ఉపయోగించు కోవాలి.. మహిళా సమాఖ్య సభ్యులు ప్రమాదబాషాత్తు మరణిస్తే 10 లక్షల,సహజ మరణం 2 లక్షలు వస్తాయి.మహిళ సమాఖ్య లో సభ్యులుగా చేరి ప్రభుత్వం పతకాలు లబ్ధి పొందాలి అన్నారు.రాష్ట్ర ప్రజలకు అందరికీ 5లక్షల చొప్పున ఇందిరమ్మ బీమా పథకం త్వరలో అమలు చేయబోతున్నాం.. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు రైతులు ఉపయోగించుకోవాలి. సివిల్ సప్లై కార్పోరేషన్, మార్క్ ఫెడ్ రెండు కూడా నష్టాల్లోనే ఉన్నాయి అన్నారు. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల నుండి పంట సాగు బడి అంశాలు నేర్చుకోవాలని రైతులు పంట సాగు పై పెట్టుబడి తగ్గించి లాభాలు ఆర్జించాలని ఆకాంక్షించారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య, డిఏఓభాస్కర్, సర్పంచ్ శంకర్, ఎసిఈ సుదర్శన్, ఎయంసి ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, డిఈ. గంగారం, ఏడిఏ తిరుపతి నాయక్, ఏడిఈ. జవహర్ నాయక్, ప్రొఫెసర్ సుజాత పాల్గొన్నారు

# సౌర విద్యుత్‌తో రైతుకు లాభాల వెలుగు



## పీఎం కుసుమ్, సూర్య ఘర్ పథకాలపై అవగాహన

## రైతు వారోత్సవంలో విద్యుత్, వ్యవసాయ శాఖల సమావేశం



**మహబూబ్ నగర్, మే 7 :**

రైతులు విద్యుత్ వినియోగదారులుగానే కాకుండా విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారి అదనపు ఆదాయం పొందే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలు కల్పిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో గురువారం మిడ్జిల్ రైతు వేదికలో వ్యవసాయ, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో సౌర విద్యుత్ పథకాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీడీసీఎల్ ఎస్ఈ భీమా నాయక్ మాట్లాడుతూ పీఎం కుసుమ్--ఏ పథకం కింద రైతులు తమ వ్యవసాయ, బంజరు భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేసి విక్రయించవచ్చన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల పరిధిలో ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అర మెగావాట్ నుంచి రెండు మెగావాట్ల వరకు సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేసి 25 సంవత్సరాలపాటు ఆదాయం పొందే వీలుందని చెప్పారు. సౌర విద్యుత్ వినియోగం పెరగడం వల్ల బొగ్గు, డీజిల్ వినియోగం తగ్గి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటుగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైతులకు ఇది దీర్ఘకాలిక ఆదాయ వనరుగా మారుతుందని వివరించారు. పీఎం సూర్య ఘర్ యోజన పథకం కింద ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేసుకుని ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను తెలంగాణ విద్యుత్ శాఖకు విక్రయించవచ్చన్నారు. యూనిట్‌కు రూ.3.14 చొప్పున చెల్లింపులు అందుతాయని తెలిపారు. రైతులు నేరుగా పథకం వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ పథకానికి ప్రభుత్వం 80 శాతం వరకు సబ్సిడీ అందిస్తోందని, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీ వర్తిస్తుందని వెల్లడించారు. గృహజ్యోతి లబ్ధిదారులు తమ ఇంటి అవసరాలకు విద్యుత్ వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ బి. వెంకటేశ్ మాట్లాడుతూ మే 4 నుంచి 9 వరకు రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ విధానాలతో పాటు సౌర విద్యుత్ పథకాలపై అవగాహన కల్పించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో విద్యుత్ శాఖ డీఈ పండరి, మండల విద్యుత్ శాఖ ఏఈ, మండల వ్యవసాయ అధికారి సిద్ధార్థ్, ఎంపీడీఓ గీతాంజలి, ఏఈవోలు, మిడ్జిల్ సర్పంచ్ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంగారి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ధర్మాపూర్ రైతు వేదికలో విద్యుత్ శాఖ ప్రత్యేక సమావేశం

ఏడు కొత్త సబ్‌స్టేషన్లతో గ్రామీణ ప్రాంతాలకు ఊరట




**మహబూబ్‌నగర్, మే 7. అక్షర కలం :**

రైతులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్ రైతు వేదికలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చొరవతో మహబూబ్‌నగర్ గ్రామీణ మండలానికి ఏడు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించారని తెలిపారు. మన్యంకొండ సమీపంలో వాటి ప్రారంభ కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సబ్‌స్టేషన్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గి రైతులకు సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోకపోయినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికే అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పంటల సాగు సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయడంలో విద్యుత్ శాఖ అధికారులు సమర్థంగా పనిచేస్తున్నారని అభినందించారు. రైతుల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నిరంతరం చొరవ చూపుతూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతులు కూడా విద్యుత్ వినియోగంలో నిబంధనలు పాటిస్తూ అవసరమైన మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మండల సర్పంచ్‌లు రాజుగౌడ్, మాధవరెడ్డి, శేఖర్, ఉపసర్పంచులు, విద్యుత్ శాఖ ఏఈ నర్సిరెడ్డి, ఏఓ సృతి, వివిధ గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా పూజల గోపికృష్ణ నియామకం

**అక్షర కలం సిద్దిపేట మే 07**

సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా సిద్దిపేటకు చెందిన యువనేత పూజల గోపికృష్ణ ని నియమించడం జరిగింది. ఈ నియామక పత్రాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ గడ్డం వివేక్ వెంకటస్వామి మరియు సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ చేతుల మీదుగా హైదరాబాద్‌లోని వారి నివాసంలో గురువారం అందజేశారు. చిన్న వయస్సులోనే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని విద్యార్థి దశ నుంచే రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన పూజల గోపికృష్ణ ఎన్ఎస్‌యూఐలో అడుగుపెట్టి కళాశాల అధ్యక్షుడిగా పని చేశారు. అనంతరం ఎన్ఎస్‌యూఐ మరియు యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేసి రాష్ట్ర స్థాయి పదవులు చేపట్టారు. విద్యార్థులు, యువత సమస్యలపై ఎన్నో ఉద్యమాలు నిర్వహిస్తూ ఢిల్లీలో లాఠీ దెబ్బలు తిన్నా, కేసులకు భయపడకుండా పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడిగా గుర్తింపు పొందారు. రైతులు, యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే గోపికృష్ణ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన నాయకుడని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా తనకు ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి కి,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా కి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి ,మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హనుమంతన్న కి,టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి కి నియోజకవర్గ ఇంచార్జ్ గౌ పూజల హరికృష్ణ గారికి, అలాగే సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళ కాంగ్రెస్, ఎస్సీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు మరియు కార్యకర్తలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మ కమిటీ సభ్యులు 27 మంది పులగుర్ల రజిత, గణపురం సంతోషి, ఉమాదేవి, అఖిల, గూడెపు దేవలక్ష్మి, ఆ బాకీ సంగీత, బత్తుల స్రవంతి, ముతకాని పోచవ్వ, అదే రెడ్డి బాలయ్య, ఐరేని అంజిరెడ్డి, బొజ్జ రాజకుమార్, ఆడపు లక్ష్మీనారాయణ, మహమ్మద్ అజ్మత్ అలీ, రాకేష్ యాదవ్, సీత బాలు, బందెల కనకయ్య, మద్దూరి ఎల్లయ్య, ఎర్ర శ్రవణ్, నరాల బాబు, ఎర్రోళ్ల బాబు, బండి శివకుమార్, రాచకొండ నాయకులు కలిమోద్దీన్, ఎర్ర మహేందర్, చెంది శ్రీనివాస్, పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955